

అన్నదాత సుఖీభవ రేపు

- జిల్లాలో 18 వేల మంది రైతుల ఖాతాలకు సొమ్ములు జమ
- రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు కేంద్రం రూ.2 వేలు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు ఈ నెల 19వ తేదీన విడుదల చేయాలని ... మిగతా 6వ పేజీలో

పర్యాటక ప్రాజెక్టుల వెల్లువ

భాగస్వామ్య సదస్సులో బోలెడు ఒప్పందాలు

- ఉమ్మడి జిల్లాలో అరకులోయ, లంబసింగిల్లో కారవాన్ పార్కులు
- అరకులో కాఫీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్



కారవాన్



కాఫీ ప్రాజెక్టు (ఫైల్ ఫొటో)

- భూమి కేటాయింపునకు ప్రభుత్వం అంగీకారం
- ఆనందపురం మండలం దబ్బందలో వెల్‌నెస్ సెంటర్
- వెల్‌నెస్ సెంటర్. అడ్వంచర్ అండ్ ఎకో టూరిజం సెంటర్ ఏర్పాటుకు 'వరల్డ్ బ్లిస్' ఒప్పందం
- రూ.100 కోట్లతో 'నవతరం' స్టూడియో
- స్టూడియో ఏర్పాటుకు 'కల్చరల్ కారవాన్ ఇండియా' ఎంవోయూ
- రూ.150 కోట్లతో 'సన్ ఇనిస్టిట్యూట్' హోటల్ నిర్మాణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో రెండు రోజులు జరిగిన సీఐఐ పెట్టుబడిదారుల సదస్సులో పర్యాటక రంగానికి సంబంధించి పలు ఒప్పందాలు కుదిరాయి. ఇందులో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించి ఎక్కువగా బీచ్ రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లు, ఎకో టూరిజం ప్రాజెక్టులు, అడ్వంచర్ స్పోర్ట్స్, కార్వాన్లు వంటివి ఉన్నాయి.

అరకులోయ, లంబసింగిల్లో కారవాన్ పార్కులు ఏర్పాటు చేయడానికి వైజాగ్ రిక్రియేషన్స్ సంస్థ ముందుకువచ్చింది. పర్యాటకులను గమ్యస్థానాలకు చేర్చడానికి వసతులతో కూడిన వాహనాలు మాత్రమే ఉపయోగిస్తే వాటిని 'కారవాన్'గా వ్యవహరిస్తారు. అలా కాకుండా నిర్దేశించిన గమ్యస్థానాల్లో కొంత స్థలం తీసుకొని పర్యాటకులకు రెస్టారెంట్, రాత్రి బస చేయడానికి కూడా వసతులు కల్పిస్తే వాటిని 'కారవాన్ పార్కు'లుగా పేర్కొంటారు. వైజాగ్ రిక్రియేషన్స్ సంస్థ అరకు, లంబసింగిల్లో కారవాన్ పార్కులు పెడుతుంది. దీనికి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం లీజు పద్ధతిలో సమకూరుస్తుంది. దీనికి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు సహకరిస్తారు. ఈ వారంలోనే భూమిని చూపించి లీజు ఒప్పందానికి వెళతారని సమాచారం. ఈ రెండు ప్రాంతాలతో పాటు బాపట్లలో కూడా కారవాన్ పార్క్ ఏర్పాటుకు ఈ సంస్థ ఒప్పందం చేసింది. మొత్తం రూ.15 కోట్ల పెట్టుబడితో 145 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. అలాగే ఓజీ డ్రీమ్‌లైనర్స్ అనే సంస్థ కారవాన్లు అద్దెకు ఇస్తామని ఎంఓయూ చేసింది. రూ.25 కోట్ల పెట్టుబడితో 80 మందికి ఉద్యోగాలు ఇవ్వనుంది. అదేవిధంగా శ్రీనివాస్ కారవాన్స్ సంస్థ రూ.2 కోట్లతో 20 మందికి ఉపాధి కల్పిస్తామని ఒప్పందం చేసింది. వీరంతా పర్యాటకుల సంఖ్య ఆధారంగా ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడి నుంచి కారవాన్లు నడుపుతారు. అద్దెకు ఇస్తారు.

కాఫీ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్

సదస్సులో అరకు కాఫీ గురించి సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, అరకులో కాఫీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి కూడా అవగాహన ఒప్పందం కుదిరింది. 'అరకు గోల్డ్ కాఫీ' పేరుతో ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ పెట్టడానికి ఓ సంస్థ చొరవ చూపింది. రెండు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటయ్యే ఈ సెంటర్ ద్వారా 1,020 మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. కాఫీ ఎలా పండుతుంది?, దానిని ప్రాసెస్ చేసి కాఫీ పొడిగా ఎలా తయారుచేస్తారు?...వంటి అంశాలన్నీ అక్కడ పర్యాటకులకు కళ్లకు కట్టినట్టు చూపిస్తారు. ఇది మంచి ప్రాజెక్టుగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

దబ్బందలో వెల్‌నెస్ సెంటర్

ఆనందపురం మండలంలోని శొంఠ్యాం సమీపాన దబ్బందలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు విజయనగర్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ... మిగతా 6వ పేజీలో

యథేచ్ఛగా గోవధ!

మాంసం ఇతర ప్రాంతాలకు ఎగుమతి



- ఇటీవల ఆనందపురం వద్ద గల ఒక కోల్డ్‌స్టోరేజీలో 189 టన్నుల మాంసం సీజ్ చేసిన డీఆర్ఐ
- అందులో అత్యధికం గోమాంసమని పరీక్షల్లో వెల్లడి
- రెండు రోజుల కిందట నగర పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి వివరాలు ఆరాతీసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- ఇతర రాష్ట్రాలకు చెందినవారి హస్తం ఉన్నట్టు గుర్తింపు
- నిందితుల కోసం గాలింపు



గో మాంసం నిల్వలను పట్టుకున్న ఆనందపురం మండలం దిబ్బమీదపాలెం గ్రామ సమీపంలోని శ్రీమిత్ర కోల్డ్ స్టోరేజీ వద్ద సోమవారం విశ్వహిందూ పరిషత్ సభ్యుల నిరసన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గోవధ, మాంసం ఎగుమతికి నగరం కేంద్రంగా మారింది. ఒడిశాతోపాటు ఉత్తరాంధ్రలోని పలు జిల్లాల నుంచి గోవులను ఇక్కడకు తీసుకువచ్చి వధిస్తున్నారు. మాంసాన్ని కోల్డ్ స్టోరేజీల్లో భద్రపరిచి ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇటీవల డీఆర్ఐ అధికారులు ఆనందపురం శివారులోని ఒక కోల్డ్‌స్టోరీజ్‌పై దాడి చేసి 189 టన్నుల మాంసాన్ని సీజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇటీవల సీపీ శంఖబ్రతబాగ్చికి ఫోన్ చేసి కేసు గురించి ఆరా తీయడంతో దర్యాప్తు వేగవంతం చేశారు.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని సంతల్లో ఆవులను కొనుగోలు చేసి కొందరు వ్యాపారులు నగరానికి తీసుకువస్తున్నారు. ఆనందపురం, మధురవాడ, ఆరిలోవ, వన్‌టౌన్ రెల్లివీధి, రైల్వేన్యూకాలనీ వంటి ప్రాంతాల్లో వధిస్తున్నారు. గోవులను వధించడం తీవ్ర నేరం. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో వ్యవహారం బహిరంగంగానే జరిగిపోతోంది. దీనిపై గోసంరక్షణ సేవకులు, హిందూ సంఘాలు చాలాకాలంగా పోరాటం చేస్తున్నాయి. గోవులను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తున్నాయి. పోలీసులు కేసు నమోదుచేసి గోవులను సమీపంలోని గోశాలలకు అప్పగిస్తున్నారు. అయితే గోమాంసం వ్యాపారులు తెలివిగా గోశాలల వద్దకు వెళ్లి నిర్వాహకులకు డబ్బులు ముట్టజెప్పి, ఆవులను రైతులకు పెంపకానికి ఇస్తున్నట్టు చూపించి పోలీసులు అప్పగించిన ఆవులను వధశాలలకు తరలించుకుపోతున్నారు. నగరంలో ప్రతిరోజూ వందల సంఖ్యలో ఆవులను వధిస్తున్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆవులను వధించిన తర్వాత మాంసాన్ని చిరు వ్యాపారులు స్థానికంగా విక్రయిస్తుంటే...పెద్ద వ్యాపారులు మాత్రం కోల్డ్‌స్టోరేజీల్లో భద్రపరిచి కంటెయినర్ల ద్వారా ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గోవధ, గోమాంసం విక్రయించడం రాష్ట్రంలో నిషేధం అయినప్పటికీ వ్యాపారులు మాత్రం తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ... మిగతా 6వ పేజీలో

ఈపీడీసీఎల్ పరిధిలో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

- సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి
- విశాఖపట్నం జిల్లాలో 3,715
- అనకాపల్లి జిల్లాలో 2,841
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15...
- గ్రిడ్‌కు అనుసంధానం



ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో 100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటుచేసినట్టు సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఇప్పటివరకూ 31,022 రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను పెట్టామన్నారు. వాటి ద్వారా 1,00,026 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఏలూరు జిల్లాలో అత్యధికంగా 13,491 కిలోవాట్లు, కాకినాడ జిల్లాలో 3,960, విశాఖపట్నం జిల్లాలో 3,715, తూర్పు గోదావరి జిల్లాలో 3,532, పశ్చిమ గోదావరి జిల్లాలో 3,382, శ్రీకాకుళంలో 3,366, విజయనగరంలో 3,279, అనకాపల్లి జిల్లాలో 2,841, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,934, పార్వతీపురం మన్యంలో 864, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15 సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చామన్నారు. వీటన్నింటినీ గ్రిడ్‌కు అనుసంధానం చేశామన్నారు. అపార్టుమెంట్లలో వ్యక్తిగత సోలార్ ప్లాంట్లకు అవకాశం లేనందున, కామన్ సర్వీస్‌కు ఉన్న కాంట్రాక్ట్ లోడ్‌కు అనుగుణంగా సోలార్ రూఫ్ టాప్ పెట్టుకోవచ్చునన్నారు. 500 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కు రూ.18 వేలు చొప్పున రాయితీ లభిస్తుందన్నారు. అతి తక్కువ వడ్డీకి ... మిగతా 6వ పేజీలో

అనంత పద్మనాభుని దీపోత్సవం రేపు



గిరిపై శంఖు, చక్ర నామాలతో వెలసిన అనంత పద్మనాభుడు

- ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున నిర్వహణ
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

పద్మనాభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని దీపోత్సవ సంబరం ఈనెల 19న నిర్వహించడానికి దేవస్థానం ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున ఈ ఉత్సవాన్ని అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తారు. అనంతుని కొండకు ఉన్న 1,286 మెట్లకు ఇరువైపులా నూనె దీపాలను ఒకేసారి వెలిగించడం ఈ ఉత్సవం ప్రత్యేకత. ఉత్సవంలో భాగంగా భక్తులు వేకువజామున తొలి పావంచా వద్ద పూజలు చేసి, మెట్లకు పసుపు, కుంకుమ బొట్లు పెడుతూ గిరిని అధిరోహించి అనంతపద్మనాభుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీపాలను వెలిగించడానికి భక్తులు మధ్యాహ్నం నుంచి మెట్లను ముందుగానే రిజర్వు చేసుకుంటారు. సాయంత్రం నాలుగు గంటలకు కుంతీమాధవస్వామి ఆలయంలో ఉన్న ఉభయ దేవేరులతో కూడిన అనంత పద్మనాభుడి ఉత్సవ విగ్రహాలను వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ గరుడ వాహనంపై ఊరేగింపుగా తొలి పావంచా వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై కొలువు తీరుస్తారు. అనంతరం విశేష అర్చనలు చేసి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కొండపై జేగంట కొట్టగానే, అప్పటికే మెట్లపై ఏర్పాటుచేసిన నూనె దీపాలను భక్తులు వెలిగిస్తారు. ఆ దీపకాంతులతో అనంతుని గిరి దేదీప్యమానంగా వెలిగిపోతుంది. ఈ ఉత్సవానికి దేవస్థానం అధికారులు, జిల్లా అధికారులు ఏర్పాట్లుపూర్తిచేశారు. తొలి పావంచాల వద్ద, కొండపై అనంతపద్మనాభస్వామి, కుంతీమాధవస్వామి, నారాయణేశ్వరస్వామి ఆలయాల వద్ద క్యూలైన్లు సిద్ధం చేశారు. పద్మనాభం ప్రధాన రహదారిని విద్యుద్దీపాలతో అలంకరించారు. పోలీసులు వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లుచేశారు.



దీపోత్సవం జరిగే అనంత పద్మనాభుని ఆలయ మెట్ల మార్గం

పెరిగిన గుడ్డు ధర

- హోల్‌సేల్‌గా 100 గుడ్లు రూ.610
- రిటైల్‌లో రూ.6.50-రూ.7
- తూర్పుభారతానికి ఎగుమతులు పెరగడమే కారణం



విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్డు ధర భారీగా పెరిగింది. విశాఖలో హోల్‌సేల్‌గా 100 గుడ్లు రూ.610, విజయనగరం, శ్రీకాకుళంలో రూ.614కు చేరుకుంది. రిటైల్ మార్కెట్‌లో ఒక గుడ్డు రూ.6.50 నుంచి ఏడు రూపాయలకు విక్రయిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మరింత ఎక్కువ రేటుకు అమ్ముతున్నారు. కార్తీకమాసంతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. చికెన్ కిలో స్కిన్‌లెస్ రూ.240కు లభిస్తోంది. అయితే గుడ్డు రేటు మాత్రం అమాంతం పెరిగింది. ఇంకా పెరుగుతుందని గుడ్ల రైతులు చెబుతున్నారు. చలికాలం కావడంతో రాష్ట్రం నుంచి తూర్పు భారతం ప్రధానంగా కోల్‌కతా మార్కెట్‌కు భారీగా గుడ్లు ఎగుమతులు అవుతున్నాయి. మిగిలిన సీజన్లతో పోల్చితే తూర్పు, ఈశాన్య భారతాల్లో శీతాకాలం గుడ్డు వినియోగం రెండింతలు అవుతుందని పేర్కొంటున్నారు. ఇదే సమయంలో క్రిస్మస్, న్యూఇయర్ వేడుకల కోసం కేకులు తయారీకి భారీగా గుడ్లు వినియోగిస్తున్నారు. అందువల్ల మార్కెట్‌లో గుడ్డు రేటు పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. చలి తీవ్రత కొనసాగినంత కాలం కోల్‌కతా మార్కెట్‌లో గుడ్డుకు డిమాండ్ ఉంటుందని, దానివల్ల ఉత్తరాంధ్రలో గుడ్డు రేటు పెరుగుతుంటుందని వ్యాపారులుచెబుతున్నారు.

ఐబొమ్మ నిర్వాహకుడు ఇంటి వద్ద హడావిడి

- సోదాలకు హైదరాబాద్ పోలీసులు వస్తున్నట్టు ప్రచారం
- భారీగా చేరుకున్న మీడియా ప్రతినిధులు



ఇమంది రవి(ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పైరసీ కేసులో 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవిని అరెస్టు చేసిన హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు నగరంలోని అతడి ఇంటికి సోదాల కోసం వస్తున్నారని సోమవారం తీవ్రస్థాయిలో ప్రచారం జరిగింది. కొత్త సినిమాలు విడుదలైన రోజే రవి పైరసీ చేసి వాటిని ఐబొమ్మ, బొప్పంటీవీ వంటి వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసేవాడు. దీనిపై సినిమా నిర్మాతలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేశారు. విదేశాల నుంచి హైదరాబాద్ వచ్చిన రవిని సీసీఎస్ పోలీసులు ఈనెల 15న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో రవి నివాసం ఉంటున్న ... మిగతా 6వ పేజీలో

కార్తీక శోభ



అక్కయ్యపాలెం రామలింగేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక మాసం నాలుగో సోమవారం జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తుల శివనామ స్మరణతో మార్మోగాయి. అర్చకులు ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ధ్వజస్తంభాల వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

ఈపీడీసీఎల్‌లో అడ్డగోలు బదిలీలు

- అనకాపల్లి సర్కిల్‌లో అధికారుల ఇష్టారాజ్యం
- అడిషన్ గ్రౌండ్స్ పేరుతో ఎవరికి కావాలంటే అక్కడికే...
- 40 రోజుల క్రితం ముగ్గురు మహిళలకు, తాజాగా మరో నలుగురికి...
- కార్పొరేట్ కార్యాలయానికి సమాచారం నిల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో బదిలీలకు ఓ సమయం అంటూ లేకుండా పోయింది. అంతా అధికారుల ఇష్టారాజ్యంగా మారింది. ప్రతి శాఖలో ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే బదిలీల ప్రక్రియ చేపడతారు. ఆ తరువాత అత్యవసరం అనుకుంటే ఉన్నతాధికారులతో చర్చించి ఒకటి, రెండు చేస్తారు. కానీ ఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్‌లో గత కొద్దికాలంగా ఎప్పుడు పడితే అప్పుడు బదిలీలు చేస్తున్నారు. సాధారణంగా సిబ్బంది పనితీరు బాగుండకపోయినా, అక్కడ ఇబ్బందులు ఎదురవుతున్నా ఆ విషయాన్ని ఆ ప్రాంత అధికారులు ...జిల్లా బాధ్యుల దృష్టికి తీసుకువెళతారు. వినియోగదారుల సౌకర్యార్థం అవసరమైతే వారిని మార్చాలని లేఖ రాస్తారు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకోవడం ఆనవాయితీ. కానీ ఇటీవల అనకాపల్లి సర్కిల్‌లో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా, ఏ అధికారి లేఖలు రాయకున్నా...కొందరిని ఉన్నతాధికారులు బదిలీ చేస్తున్నారు. పోనీ అక్కడ సమస్య పరిష్కారం కోసమా?...అంటే ఆ కారణాలూ కనిపించడం లేదు. ఎవరి లబ్ధి కోసమో బదిలీలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా అంటే రెండు రోజుల కిందట నలుగురు జూనియర్ ఇంజనీర్లను బదిలీలు చేశారు. పరవాడ ఫార్మాసిటీలో పనిచేస్తున్న ఎస్.బంగారయ్యను రోలుగుంటకు వేశారు. రోలుగుంటలో ఉన్న ఓ.రమేశ్‌ను నక్కపల్లికి పంపించారు. అక్కడ ఉన్న ఎం.రామచంద్రను అచ్యుతాపురం వేశారు. అక్కడ పనిచేస్తున్న డి.జె.ప్రసాదరావును పరవాడ ఫార్మాసిటీకి బదిలీ చేశారు. పరిపాలన, ఆపరేషన్ సౌలభ్యం కోసం ... మిగతా 6వ పేజీలో

అప్పన్నకు వైభవంగా తులసీ దళార్చన



సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సహస్ర తులసీ దళార్చన సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి అనకాపల్లి జిల్లా మంత్రిపాలెం గ్రామానికి చెందిన జెర్రిపోతుల అప్పారావు దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని చెక్ రూపంలో పీఆర్‌ఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వి. సూర్యనారాయణకు సోమవారం వారు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

ఘాట్ రోడ్డులో సోలార్ లైట్లు ఏర్పాటు



అనంతుని గిరిపై వేసిన సోలార్ లైట్లు

పద్మనాభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఘాట్ రోడ్డులో దాతల సహకారంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. సుమారు 3 కిలోమీటర్ల నిడివి గల ఘాట్ రోడ్డులో వీటిని అమర్చారు. ఈనెల 19న జరిగే దీపోత్సవం నేపథ్యంలో ఘాట్ రోడ్డు మార్గంలో నడిచే భక్తులకు ఈ లైట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇప్పటివరకు 16 లైట్లను సమకూర్చడానికి దాతలు సహకరించారు.

పీజీఆర్‌ఎస్‌కు ఐదు వినతులు

భీమునిపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి అయిదు వినతులు అందాయి. ఆర్‌డీఓ సంగీత్ మాథుర్ ఫిర్యాదారుల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీలన్నీ భూ సమస్యలపై వచ్చాయని, వాటిని ఆయా మండలాల తహశీల్దార్ కార్యాలయాలకు పంపించామని ఆర్‌డీఓ తెలిపారు. అలాగే జోనల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. జడ్సీ అయ్యప్పనాయుడు అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి 2, ప్రజారోగ్య విభాగానికి, రెవెన్యూ విభాగానికి ఒక్కొక్కటి చొప్పున అర్జీలు వచ్చాయి.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ఎండాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ త్రీ ఆర్ సెంటర్ ఆవరణలో 8వ వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ సమకూర్చిన దుస్తులను కార్పొరేటర్ లొడగల అప్పారావు సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చెట్టుపల్లి సన్యాసిరావు, శాఖరీ శ్రీనివాస్, దొరబాబు, కాటూరి వీర్రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

వలందపేట రైతుల నిరసన

తగరపువలస, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని సంగివలస సమీపంలో వలందపేట వద్ద ఉన్న తమ భూములను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపించారు. సోమవారం వారు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు.

సింహగిరిపై వృశ్చిక సంక్రమణ పూజలు

సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి వృశ్చిక సంక్రమణ పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సోమవారం ప్రభాతారాధనలు తరువాత ప్రత్యేక ఆరాధనలు జరిపారు. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో అలంకరించి పల్లకిలో ఉంచారు. అలయ విద్వాంసుల నాదస్వరాలపవనలు, పండితుల మంత్రోచ్చారణల నడుమ తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కాపులుప్పాడ, చేపలుప్పాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం యూజీ కేబుల్ వర్క్ పనులు, నిర్వహణ పనుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు విశాఖ జోన్ త్రీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి. సింహాచలంనాయుడు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చిలుకూరి లేఅవుట్,విలాసం లేఅవుట్, పెద ఉప్పాడ, చిన ఉప్పాడ, చేపల దిబ్బడిపాలెం, గంగడిపాలెం, గోవుపేట, కొత్తూరు, బోయిలూరు, పెద బస, మంగమారిపేట, కె. నగరపాలెం, కల్లివానిపాలెం, తిమ్మాపురం, కాపులుప్పాడ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

ఐబొమ్మ నిర్వాహకుడు ఇంటి వద్ద హడావిడి

... 5వ పేజీ తరువాయి

ఫ్లాట్‌లో పోలీసులు సోదాలు నిర్వహించి కొన్ని హార్డ్ డిస్కులు, పైరసీ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న లింక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రవి స్వస్థలం విశాఖపట్నం కావడంతో పోలీసులు ఇక్కడ కూడా సోదాలు చే యడానికి వచ్చారంటూ నగరంలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. దీంతో పెదగదిలి ప్రాంతంలో గల రవి నివాసం వద్దకు సోమవారం ఉదయం మీడియా ప్రతినిధులు పెద్దఎత్తున చేరుకున్నారు. అయితే కొద్దిసేపు వేచిచూసి పోలీసులు రాకపోవడంతో వెనుతిరిగారు. అతడి తండ్రి చినఅప్పారావు మాత్రం రవి చేసిన పని తీవ్రమైన నేరమని, 15 ఏళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడని...రెండేళ్ల కిందట ఒకసారి వచ్చివెళ్లాడన్నారు. అతనితో తమకు కనీసం మాట్లాడే పరిస్థితి లేదన్నారు. రవిని పోలీసులు ఏం చేసుకున్నా తమకు అభ్యంతరం లేదని స్పష్టంచేశారు.

ఈపీడీసీఎల్ పరిధిలో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

... 5వ పేజీ తరువాయి

బ్యాంకు రుణాలు, ఈఎంఐలు ఇస్తాయన్నారు. వినియోగదారులు పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని, అందులో ఎంప్యానల్ అయిన వెండర్స్ నుంచి సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుకు, నెట్ మీటర్‌కు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటరు పెట్టుకున్న వారికి నెట్ మీటర్ అవసరం లేదని స్పష్టంచేశారు. ఇంకేమైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.



ఎండాడలో ప్రత్యేక అలంకరణలో పశుపతినాథేశ్వరుడు



మానం ఆంజనేయనగర్‌లో శివలింగం అలంకరణ



పీఎంపాలెం యడ్లమల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపారాధన



భీమిలిలోని శివాలయంలో నందీశ్వరునికి దీపారాధన

శివాలయాలకు కార్తీక శోభ

తెల్లవారుజాము నుంచే బారులు తీరిన భక్తులు

స్వామికి ప్రత్యేక పూజలు

భీమునిపట్నం,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం నాలుగో సోమవారం కావడంతో వేకువజామున నాలుగు గంటల నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. భీమిలిలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం, కాత్యాయిని సహిత భీమేశ్వరాలయం,బాలాత్రిపుర సుందరి సహిత చంద్రశేఖర, నేరేళ్లవలస పురాతన శివాలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. చోడేశ్వరాలయంలో దర్శనాలకు క్యూ కట్టారు. లక్ష్మీనరసింహస్వామి, వేణుగోపాలస్వామి, జగన్నాథ స్వామి ఆలయాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. రావిచెట్టు, ఉసిరి చెట్టు, తులసి మొక్కకు పూజలు చేశారు. సాయంత్రం ఆలయాల్లోని నందీశ్వరులకు, ధ్వజ స్తంభం వద్ద, ఉసిరి, తులసి మొక్క వద్ద దీపారాధనలు జరిపారు.

ఎండాడలో..

ఎండాడ : ఎండాడలోని కోదండ రామాలయం, షిర్డీసాయి గణపతి పశుపతినాథేశ్వర స్వామి ఆలయ ఆవరణలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలానే కైలాసగిరి దిగువన ఉన్న భవానీ సమేత కైలాసగిరీశ్వరస్వామి ఆలయంలో సామూహిక అభిషేకాలు, విశాలాక్షీనగర్‌లో ఉన్న విశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తుల శివ నామ స్మరణతో మార్మోగాయి.

మధురవాడలో...

మధురవాడ : మధురవాడ పరిసరాల్లోని శివాలయాలు వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. మానం ఆంజనేయనగర్‌లోని లలిత త్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి సామూహిక అభిషేకాలు చేశారు. మిథిలాపురి వుడాకాలనీలోని ఉమా భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూ జలు జరిపారు. మధురవాడ, స్వతంత్రనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని శివాలయాలు కూడా పూజలు జరిగాయి. ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

సింహాచలంలో..

సింహాచలం : సింహాచలం పరిసరాల్లోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆఖరి సోమవారం కావడంతో వేకువజామునే భక్తులు సింహాచలం చేరుకుని కొండ దిగువ వరాహ పుష్కరిణిలో, సింహగిరి మెట్ల మార్గంలోని జలధారల్లో స్నానాలు ఆచరించారు. అనంతరం సింహగిరి క్షేత్ర పాలకుడు, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు, ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. 98వ వార్డు పరిధిలోని సింహపురికాలనీ, సింహాచల నగర్, పాత అడివివరం, కాపువీధి, విజినిగిరిపాలెం ప్రాంతాల్లోని శివాలయాల్లో కూడా భక్తులు పూజలు చేశారు.



సింహాచలంలో భక్తుల దీపారాధన

పీఎంపాలెంలో..

కొమ్మాది : పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న ఎడ్లమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. ఈనెల 21న పోలి పాడ్యమి సందర్భంగా ఉదయం శివపార్వతుల కల్యాణం, మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కాగా కార్తీక సోమవారం పురస్కరించుకుని కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయం, మారికవలస కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, సిద్దేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు

అనంతుని దీపోత్సవం ఏర్పాట్లపై నార్త్ ఏసీపీ సమీక్ష

పద్మనాభం/పద్మనాభం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంతుని దీపోత్సవానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని మధురవాడ నార్త్ జోన్ ఏసీసీ అప్పలరాజు తెలిపారు.సోమవారం రాత్రి ఆయన కుంతీమాధవస్వామి ఆలయం వద్ద నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. సీపీ ఆదేశాల మేరకు 500 మంది సిబ్బంది తో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఉత్సవానికి చేరుకునే మార్గాల్లో మధ్యాహ్నం 1 గంట తరువాత భారీ వాహనాలను దారి మళ్లిస్తామన్నారు. చిన్నాపురం జంక్షన్, నీలకుండీలు జంక్షన్, మహారాజ్‌పేట జంక్షన్ మీదుగా భక్తులు ఉత్సవానికి వస్తారన్నారు. చిన్నాపురం నుంచి బస్సుల్లో వచ్చేవారు అర్చకునిపాలెం వద్ద, మహారాజ్‌పేట జంక్షన్ నుంచి వచ్చే వారిని స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల వద్ద, నీలకుండీలు నుంచి వచ్చే వారిని చెరకు కాటా వద్ద నిలిపివేస్తామన్నారు అక్కడి నుంచి వారు నడిచి ఉత్సవ స్థలానికి చేరుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరా, డ్రోన్ కెమెరాలతో ఉత్సవాన్ని పర్యవేక్షిస్తూ ప్రతి అంశాన్ని జల్లెడ పడతామన్నారు. మెట్లకు వెళ్లే దారిలో ఎటువంటి దుకాణాలు ఏర్పాటు చేయవద్దని, అందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు.మెట్ల మార్గంతోపాటు ఘాట్‌రోడ్డులో వచ్చీపోయే భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉత్సవం రోజున ఘాట్ రోడ్డులో వాహనాలకు అనుమతి లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె. రూపేష్‌కుమార్, సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ అప్పలరాజు

సీహెచ్ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ సాయి, డీటీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేశ్ కుమార్, సర్పంచ్ ప్రతినిధి టి. పద్దు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాల వివరాలు

చిన్నాపురం జంక్షన్ నుంచి వచ్చే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు జెడ్పీ అతిథి గృహం వద్ద, బస్సులకు అర్చకునిపాలెం గ్రామం వద్ద పార్కింగ్ స్థలం కేటాయించారు. మహారాజ్‌పేట నుంచి వచ్చేవారు మండల కార్యాలయాల సముదాయం వద్ద, బస్సులకు స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల వద్ద. నీలకుండీలు నుంచి వచ్చేవారు పెట్రోల్ బంకు వద్ద తూనిక యంత్రం, గరానా సత్యనారాయణ ఖాళీ స్థలం, బస్సులకు చెరకు కాటా వద్ద పార్కింగ్ స్థలాలు కల్పించారు.

సీహెచ్‌సీలో సదరం శిబిరం

భీమునిపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సదరం శిబిరం నిర్వహించారు. కేజీహెచ్ నుంచి వచ్చిన ఆర్థోపెడిక్ వైద్యుడు కృష్ణమూర్తి దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ జనవరి నుంచి జూలై వరకూ వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలు నిర్వహించలేదన్నారు. గతంలో వికలాంగుల రీ అసెస్‌మెంట్ కార్యక్రమాన్ని జరిపామన్నారు. ఇకపై ప్రతి సోమవారం ఇక్కడ సదరం శిబిరం నిర్వహిస్తామని, ఆర్థోపెడిక్ వైద్యులు ప్రత్యేకంగా వస్తారని చెప్పారు. తొలి రోజు 15 మంది స్లాట్‌లు బుక్ చేసుకోగా వారందరికీ పరీక్షలు నిర్వహించామన్నారు.

నగరాల కార్పొరేషన్ చైర్మన్ మృతి పట్ల సంతాపం

మధురవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్వరరావు సోమవారం ఉదయం విజయవాడలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి కూటమి ప్రభుత్వానికి తీరని లోటని మధురవాడకు చెందిన నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు అన్నారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

భీమునిపట్నం : రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్ తిరుమలేశ్వరరావు మృతి పట్ల ఆ కార్పొరేషన్ డైరెక్టర్, భీమిలి మండల నాయకుడు పోతిన అప్పలరాజు సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి, నగరాల సంక్షేమానికి తిరుమలేశ్వరరావు ఎంతో కృషి చేశారన్నారు. ఈమేరకు ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఔషధ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యం

సాగర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఔషధ రంగంలో నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఉందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్. శ్రీనివాస్ అన్నారు. ఔషధ రంగంలో నాణ్యతా వారోత్సవాల సందర్భంగా సోమవారం గీతంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 200 దేశాలకు భారతీయ ఔషధాలు ఎగుమతి అవుతున్నాయని, వాటి విలువ 30 బిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు. చిన్న పొరపాటు సహితం తీవ్ర ప్రభావం చూపుతుందని, ఔషధాల తయారీలో నిబంధనలు పాటిస్తూ నాణ్యతపై దృష్టిసారించాలని చెప్పారు. కార్యక్రమంలో వీఎస్‌ఆర్ ఎలైఫ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ రీసెర్చి డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ గుప్తా, గీతం ఫార్మస్యూటికల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాగర్ సుమన్ పండా, డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

టీడీపీ నేత గురునాథ్‌కు సన్మానం

కొమ్మాది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు గరే గురునాథ్‌ను రేవళ్లపాలెం టీడీపీ నాయకులు నాగోతి వెంకట్రావు, పోతిన శ్రీనివాసరావు సోమవారం సత్కరించారు. గురునాథ్‌ను వారు ఆయన నివాసంలో కలిశారు. కార్యక్రమంలో పోతిన పెంటయ్య, వాండ్రాసి వెంకట అప్పారావు, వాండ్రాసి శ్రీను, వాండ్రాసి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



అడవివరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, యువకులు



భీమిలి : మాట్లాడుతున్న పట్టణ ప్రముఖుడు మైలపల్లి లక్ష్మణరావు

గ్రంథాలయాలు యువత భవితకు దిక్సూచి

వారోత్సవాల్లో వక్తలు ▸▸ పలు అంశాలపై అవగాహన

సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు గ్రంథాలయాలు దిక్సూచిగా నిలుస్తాయని గురుకుల పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ టీకే రమేశ్ అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం ఆధ్వర్యంలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా సోమవారం జరిగిన యువజన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరమై భవితను ఉత్తమంగా తీర్చిదిద్దుకునేందుకు పుస్తకాలను ఆధారం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఉపాధ్యాయులు బీబీ రాజేశ్, న్యాయవాది కె. రామకృష్ణ, కార్మిక నేత సూర్యనారాయణరాజు, విశ్రాంతి ఎస్ఐ శైలేంద్రబాబు పాల్గొన్నారు.

భీమునిపట్నం : యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని భీమిలి వినియోగదారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు కనకల సన్యాసినాయుడు సూచించారు. సోమవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జూనియరు కళాశాల అధ్యాపకుడు ప్రసాద్, గ్రంథాలయాధికారి మహేశ్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.



పడి పూజలో పాల్గొన్న భక్తులు

పీఎంపాలెంలో ఘనంగా అయ్యప్ప పడి పూజ

కొమ్మాది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం రెండవ బస్టాప్ వద్ద పోతిన ప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అయ్యప్ప పడి పూజ ఘనంగా జరిగింది. నగర సీపీ శంఖబ్రతబాగ్చి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీపీని నిర్వాహకులు శాలువతో సన్మానించారు. అనంతరం స్వాములు అయ్యప్ప గీతాలు ఆలపించి, భజనలు చేశారు. కార్యక్రమంలో సీఐ బాలకృష్ణ, జడ్సీ రాము, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాయుడు, ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు గురునాథ్, దాసరి శ్రీనివాస్, బీజేపీ నాయకుడు ప్రమోద చక్రవర్తి, ముత్తంశెట్టి మహేశ్, పోతిన హనుమంతు, జనసేన నేత సంతోష్‌నాయుడు పాల్గొన్నారు.

బాందేవుపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా కృష్ణమూర్తిరాజు

పద్మనాభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :బాందేవుపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా సాగి కృష్ణమూర్తిరాజును నియమించారు. ఈమేరకు సహకార శాఖాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయ నతో పాటు రెడ్డి శ్రీను, బుగత శ్రీనివాసరావును డైరెక్టర్లుగా నియమించారు. ఈగ్రామం పేరుతో సొసైటీ ఉన్నా.. ఇప్పటివరకు గ్రామంలో ఎవరూ పదవులు చేపట్టలేదు. తొలిసారిగా గ్రామానికి చెందిన వ్యక్తికి పదవి లభించింది. మాజీ సర్పంచ్ అయిన కృష్ణమూర్తిరాజును నామినేటెడ్ పదవి వరించింది. గ్రామానికి చెందిన వ్యక్తికి పదవి లభించడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటక ప్రాజెక్టుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

సంస్థ ఎంఓయూ చేసింది. సుమారుగా ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ అధినేత తిరుపతిరాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దాదాపు రూ.45 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ వెల్‌నెస్ సెంటర్‌లో 170 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

- వరల్డ్ బ్లిస్ అనే సంస్థ కూడా ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్, అడ్వెంచర్ అండ్ ఎకో టూరిజం సెంటర్ ఏర్పాటుకు ఎంఓయూ చేసింది. వీరు రూ.100 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఏ ప్రాంతంలో అనేది ఇంకా ఖరారు కాలేదు.

నవతరం సినీ స్టూడియో

రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైనది ఉమ్మడి విశాఖ జిల్లానే. విశాఖపట్నం, భీమిలి, గంగవరం, అప్పికొండ, యారాడ, కొండకర్ల ఆవ ప్రాంతాలతో పాటు అరకు, లంబసింగి తదితర చోట్ల కొన్ని దశాబ్దాలుగా సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి. విశాఖలో సినిమా స్టూడియోలు ఏర్పాటు చేయడానికి చాలామంది ఆసక్తిగా ఉన్నారు. ప్రభుత్వాన్ని భూములు కూడా కోరుతున్నారు. తాజాగా జరిగిన సదస్సులో నవతరం సినీ స్టూడియోస్ సంస్థ స్టూడియో ఏర్పాటుకు ఎంఓయూ చేసింది. రూ.100 కోట్ల పెట్టుబడితో ఐదు వేల మందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొంది. ఎక్కడ అనేది ఇంకా స్పష్టత రాలేదు. భూమి కేటాయింపులపై చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.

- కల్చరల్ కారవాన్ ఇండియా అనే సంస్థ కూడా స్టూడియో ఏర్పాటుకు ఒప్పందం చేసింది. భూమి కేటాయిస్తే రూ.60 కోట్ల పెట్టుబడితో 25 మందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొంది.
- సాగర్‌నగర్‌లో పర్యాటక శాఖ భవనంలో సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ నడుపుతున్న జాస్తి శ్రీకాంత్ స్టార్ హోటల్ ఏర్పాటు చేయడానికి ఎంఓయూ చేశారు. రూ.150 కోట్ల పెట్టుబడితో 2,500 మందికి ఉద్యోగాలు ఇస్తామని పేర్కొన్నారు.

ఈపీడీసీఎల్‌లో అడ్డగోలు బదిలీలు

... 5వ పేజీ తరువాయి

ఈ బదిలీలు చేశామని ఉత్తర్వుల్లో ఎస్ఈ పేర్కొన్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులు ఎవరూ వీరి బదిలీల కోసం సిఫారసు చేయలేదు. లేఖలూ రాయలేదు.

ఆ విషయం కార్పొరేట్ కార్యాలయానికే తెలియదు

అనకాపల్లి సర్కిల్‌లో జరుగుతున్న బదిలీల విషయం పక్కనే విశాఖలో ఉన్న కార్పొరేట్ కార్యాలయానికి కూడా తెలియడం లేదు. ఆ సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఏఈలుగా పనిచేస్తున్న ముగ్గురు మహిళలు పి.విజయప్రభ, వి.విజయలక్ష్మి, విష్ణుప్రియలను జిల్లా ఉన్నతాధికారి 40 రోజుల క్రితం బదిలీ చేశారు. ఈ విషయం తెలియక ఇటీవల సీఐఐ పెట్టుబడిదారుల సదస్సుకు డ్యూటీలు వేసినప్పుడు ఆయా మహిళా అధికారులు పూర్వపు స్థానాల్లోనే ఉన్నారనుకొని ఆ విధంగానే ఉత్తర్వులు జారీ చేశారు. ఇది చూసి సర్కిల్ అధికారులు అంతా ఆశ్చర్యపోయారు. ఏ విషయం కార్పొరేట్ కార్యాలయానికి చెప్పడం లేదనే విషయం బయటపడింది.

పనితీరులో అట్టడుగున...

అనకాపల్లి జిల్లాకు ఇటీవల అధిక ప్రాధాన్యం ఏర్పడింది. పెద్ద పెద్ద పరిశ్రమలన్నీ వస్తున్నాయి. అయితే వినియోగదారుల నుంచి ప్రతి నెలా తీసుకునే ఫీడ్ బ్యాక్ ప్రకారం చూసుకుంటే ఈ జిల్లా అట్టడుగున ఉంటోంది. విద్యుత్ సరఫరా సరిగ్గా ఉండడం లేదని, ఫిర్యాదులు చేస్తే సకాలంలో స్పందించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గత ఐదు నెలల నుంచీ ఈ జిల్లా అట్టడుగున ఉందని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ముఖ్యంగా మాడుగుల, రావికమతం మండలాల నుంచి అధిక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆకస్మిక బదిలీలపై అనకాపల్లి ఎస్ఈ జి.ప్రసాద్‌ను వివరణ కోరగా, పరిపాలన అవసరాల కోసమే చేపడుతున్నామన్నారు. కార్పొరేట్ కార్యాలయానికి కూడా సమాచారం ఇస్తామని పేర్కొన్నారు.

యథేచ్ఛగా గోవధ!

... 5వ పేజీ తరువాయి

ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్పందించి ఆనందపురం మండలం శివారులోని ఒక గోడౌన్‌పై కొద్దిరోజుల కిందట దాడిచేశారు. ఆ సమయంలో సుమారు 189 టన్నుల మాంసం పట్టుబడింది. నమూనాలను తీసి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించగా పట్టుబడిన దాంట్లో అత్యధికం గోమాంసమేనని నిర్ధారిస్తూ నివేదిక పంపినట్టు తెలిసింది. దీనిపై రెండు రోజులు కిందట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా సీపీ శంఖబ్రతబాగ్చికి ఫోన్ చేసి ఆరాతీశారు. దీంతో గోమాంసం కేసు విషయం వెలుగులోకి వచ్చింది. గోవులను వధించడం, అక్రమంగా తరలించడం నేరం కాబట్టి, అలాంటిపనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించినట్టు తెలిసింది. అలాగే అంతపెద్ద మొత్తంలో గోమాంసం ఎక్కడి నుంచి వచ్చింది?, ఎక్కడ వధించారు?, ఎక్కడి నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు?, వాటి రవాణా ఎలా జరుగుతోందనే వివరాలు ఆరా తీసినట్టు తెలిసింది. దీనికి సీపీ స్పందిస్తూ కేసు డీఆర్ఐ దర్యాప్తు చేస్తున్నప్పటికీ పోలీస్ శాఖాపరంగా కూడా వివరాలను ఆరా తీయడంతోపాటు మూలాలను గుర్తిస్తామని డిప్యూటీ సీఎంకు వివరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే పోలీసులు కేసు దర్యాప్తు వేగం పెంచారు. గోమాంసం ఎగుమతిలో ఇతర రాష్ట్రాలకు చెందినవారే కీలకంగా వ్యవహరిస్తున్నట్టు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ఆయా రాష్ట్రాలకు ఇప్పటికే సిబ్బందిని పంపినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా గోవధకు కేంద్రంగా మారిన విశాఖ నగరంలో గోవుల రవాణా, వధకు పూర్తిగా అడ్డుకట్ట వేయడంపై సీపీ దృష్టిసారించాలని గోసంరక్షణ కార్యకర్తలు, హిందూ ధర్మపరిరక్షణ సంఘాలు కోరుతున్నాయి.

అన్నదాత సుఖీభవ రేపు

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించింది. అర్హులైన ప్రతి రైతు ఖాతాకు రూ.ఐదు వేల వంతున జమ చేయనున్నది. అదే సమయంలో కేంద్రం 'పీఎం కిసాన్' నిధి కింద రూ.రెండు వేలు జమ చేస్తుంది. అంటే ప్రతి రైతుకు రూ.ఏడు వేలు అందనున్నాయి. అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడత విశాఖ జిల్లాలోని నాలుగు మండలాల్లో సుమారు 18 వేల మంది రైతులకు లబ్ధి చేకూరింది. రెండో విడతలో కూడా 18 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు. రూ.12.5 కోట్ల మేర జమ కానున్నాయని అంచనా వేస్తున్నారు.



వెంకోజీపాలెం : అభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సుజన దంపతులు



ఆరిలోవ : బాలాత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి



పెదవాల్తేర్ : కాశీ విశ్వేశ్వర ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

» వేకుల జాము నుంచే శివాలయాలకు పోటెత్తిన భక్తులు » ప్రత్యేక పూజలు, అభిషేకాలు » సాయంత్రం భక్తి కార్యక్రమాలు, ఆకాశ దీపాల వెలుగులతో సందడి

వెంకోజీపాలెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం ఆఖరి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివుడి దర్శించుకునేందుకు తెల్లవారుజాము 3 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

కొత్త వెంకోజీపాలెంలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలో శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేకువ జాము నుంచి కార్తీక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆయన సతీమణి వెలగపూడి సుజన పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహా రుద్రాభిషేకాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శివలింగాన్ని పసుపుతో అలంకరించారు. సాయంత్రం మహిళలు ధ్వజస్తంభం వద్ద ఆకాశజ్యోతిని వెలిగించారు., ఈవో బండారు ప్రసాద్, ఇతర సిబ్బంది భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా తగు చర్యలు తీసుకున్నారు. వీరికి స్థానిక గ్రామ సేవా సంఘం సభ్యులు, ఇతర భక్తులు సహాయ సహకారాలు అందించారు. సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీల ప్రేమ్‌కిరణ్ జగదీష్, టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు, మద్దాల వీర వెంకట ప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే.. కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ శివాలయాల్లో ఆఖరి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివనామ స్మరణం చేశారు. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోనున్న ధ్వజ స్తంభం వద్ద ఆకాశజ్యోతులను వెలిగించారు. ఆలయ కార్యదర్శి సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజర్ బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక నాలుగో సోమవారం సందర్భంగా పెదవాల్తేరులోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో వైభవంగా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో గల గ్రా ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చారు. సాయంత్రం ఆకాశ దీపం వెలగించారు. ఆలయ ప్రధాన అర్చకులు కాశీప్రసాద్, చిన్నఅప్పారావు, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక నాలుగో సోమవారం సందర్భంగా ఆరిలోవలోని శివాలయాలు వేకువ జాము నుంచి భక్తులతో నిండిపోయాయి. ఆరిలోవలో గల బాలాత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయంలో శివుగాకి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. భక్తులందరికీ మధ్యాహ్నం భోజనాలను ఆలయం ట్రస్టీ కృష్ణ రాజే ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అలాగే పెదగదిలిలో గల కాశీఅన్నపూర్ణ సహిత విశ్వేశ్వరాలయం, చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో వెలిసిన స్ఫటిక లింగేశ్వర ఆలయం, ఆరిలోవలో గల జ్యోతిర్లింగేశ్వ రాలయం, రవీంద్రనగర్ ఆఖరి బస్టాపు కొండపైన విశ్వకర్మ సేవా సంఘం ఆధ్వర్యంలో గల లక్ష్మీగణపతి విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

బోరుబావి తొలగింపును అడ్డుకున్న స్థానికులు

» రోడ్డు నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణ



బోరు బావిని తొలగిస్తున్న సిబ్బంది

మద్దిలపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెం చిన్నపోలమాంబ ఆలయం రోడ్డులో సోమవారం బోరుబావి తొలిగింపు వివాదమైంది. జీవీఎంసీ వాటర్ సప్లై వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు కూలీలు బోరుబావి తొలగింపు పనులు చేపట్టారు. సగం బోరు తీస్తుండగా గమనించిన సానికులు కూలీలను అడ్డుకున్నారు. నీరు వస్తున్న బోరును ఎందుకు తీస్తున్నారని నిలదీశారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ అని చెప్పడంతో అతడికి ఫోన్ చేసి ఎందుకు బోరు తొలిగిస్తున్నారంటూ ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణం చేస్తుండడంతో బోరును తొలగిస్తున్నామని సమాధానమివ్వడంతో మండిపడ్డారు. బోరుబావి వేసిన తర్వాత రెండు దఫాలు రోడ్డులు వేశారని, అప్పుడు తొలగించని బోరు ఇప్పుడు ఎందుకు తీసేస్తున్నారని వాదించారు. ఇక్కడ బోరుతో తమ నీటి అవసరాలు తీర్చుకుంటున్నామని, అవసరాలకు వినియోగిస్తున్న బోరును తొలగిస్తే ఊరుకోమని హెచ్చరించడంతో విప్పిన బోరును బిగించి కూలీలు వెళ్లిపోయారు.

కాగా మంగాపురంకాలనీ రోడ్డు నిర్మాణం పేరుతో పిక్క, తాగునీరు పైప్‌లైన్‌ల మీద వేశారు. దీంతో ఉదయం నుంచి అక్కడ స్థానికులకు తాగునీరు పట్టుకునే వీలులేక ఇబ్బందులు పడ్డారు. 22వ వార్డులో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరించి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేరంటూ స్థానికులు మండిపడుతున్నారు.

రైల్వే జోన్ కోసం భూములిచ్చిన గిరిజన రైతులకు న్యాయం చేస్తాం

» గ్రామసభలో స్పష్టం చేసిన చినగదిలి తహసీల్దార్ కిరణ్‌పాల్



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ పాల్ కిరణ, పాల్గొన్న అధికారులు

ఆరిలోవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల గిరిజనుల భూములను రైల్వే జోనల్ కార్యాలయానికి కేటాయించడం వల్ల నష్టపోయిన 51 కుటుంబాల గిరిజన రైతులతో సోమవారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. గతంలో నిరసన చేపట్టిన గిరిజన రైతులు నష్ట పరిహారం చెల్లిస్తామంటూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హామీ మేరకు రెవెన్యూ అధికారులు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చినగదిలి రూరల్ మండల తహసీల్దార్ కిరణ పాల్ మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందవద్దన్నారు. గతంలో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు భూమి కోల్పోయిన ప్రతి రైతుకు ఐదు సెంట్ల భూమిని ఇదే ప్రాంతంలో ఇచ్చేం దుకు నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, రైతులకు తప్పక తగిన న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ గ్రామసభలో టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు, గ్రామస్థులు, స్థానిక గిరిజనులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వరకట్న నిషేధ సలహామండలి సభ్యురాలిగా డాక్టర్ ఉష



ఆచార్య ఉషను అభినందిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

సిరిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి వరకట్న నిషేధ సలహా మండలి సభ్యురాలిగా ఏయూ దుర్గాదేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సహాయ ఆచార్యులు డాక్టర్ పి.ఉష నియమితులయ్యారు. ఆమెకు సోమవారం ఏయూ వైస్ చాన్సలర్ రాజశేఖర్ అభినందించారు. జిల్లా కలెక్టర్‌తో నియమించబడిన్న కమిటీలో సభ్యురాలుగా ఏయూ ఆచార్యులకు అవకాశం దక్కడం ఆనందకరమన్నారు. మహిళల పక్షాన నిలిచి, వారి సహాయం అందించాలన్నారు. అలాగే డాక్టర్ ఉషకు వర్సిటీలోని పలువురు ఆచార్యులు అభినందనలు తెలిపారు.

అర్థశాస్త్రంపై విద్యార్థులు పట్టుసాధించాలి

» సిడార్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేసీ రెడ్డి



కేసీ రెడ్డిని సన్మానిస్తున్న ఆచార్య నరసింహారావు తదితరులు

సిరిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాస్త్రంపై విద్యార్థులు పట్టు సాధించాలని సిడార్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. వర్సిటీ అర్థ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సర్వేశ్వరరావు షష్టిపూర్తి ఎండోమెంట్ లెక్చర్‌ను సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేసీ రెడ్డి మాట్లాడుతూ అర్థశాస్త్రం మానవ జీవన గమనంలో అనేక అంశాలను నేర్పుతుందన్నారు. భవిష్యత్తులో నైపుణ్యం గల ఆర్థిక వేత్తల అవసరం ఎంతో ఉంటుందన్నారు. విద్యార్థులు సబ్జెక్టులో నైపుణ్యం సాధించాలన్నారు. ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ ఆర్థిక విశ్లేషకుల అనుభవాలను స్ఫూర్తిగా తీసుకొని సబ్జెక్టుపై పట్టు సాధించాలన్నారు.

ఈ సందర్భంగా కేసీ రెడ్డిని వర్సిటీ అర్థశాస్త్ర విభాగం తరపున ఆచార్య నరసింహారావు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బోర్డ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య డి.ఆశాలత అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి లిల్లీ గ్రేస్, ఆచార్య సర్వేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీలకు సత్కారం



కలెక్టర్, జేసీలను సత్కరిస్తున్న జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 14, 15 తేదీలలో భాగస్వామ్య సదస్సు విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌లను జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం దుశ్శాలువాలతో సత్కరించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం వేదికగా వారిని సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఏ త్రినాథరావు మాట్లాడుతూ సదస్సు విజయవంతం కోసం అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ అధికారులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఇదే సందర్భంలో పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అధికారులంతా కరతాళ ధ్వనులతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను అభినందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పాలనాధికారి బీవీ రాణి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యాంప్రసాద్, రాష్ట్ర క్రీడా కార్యదర్శి రాజేంద్రవర్మ, ప్రతినిధులు యోగి, రవిప్రకాశ్, కిశోర్, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్కుల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

» సీఐ ప్రసాద్ హెచ్చరిక » డ్రోన్ సాయంతో ఆకతాయిని పట్టుకున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



యువకులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్

వెంకోజీపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15, 16 వార్డుల్లో ఖాళీ స్థలాలు, పార్కులలో బహిరంగ మద్యం సేవిస్తున్నారని, దీనివల్ల పార్కుకు వచ్చే చిన్నారులు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఎంవీపీ పీఎస్ సీఐ ప్రసాద్ స్పందించారు. తన బ్లూకోర్టు సిబ్బంది సురేష్‌తో కలిసి ఈ వార్డుల్లో ఖాళీ స్థలాలు, అబ్దుల్ కలాం పార్కులో గస్తీ నిర్వహించారు. డ్రోన్ ద్వారా పలువురు యువకులు బహిరంగంగా మద్యం తాగుతున్నట్టు గుర్తించి వారిని పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. పార్కు వద్ద అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అబ్దుల్ కలాం పార్కు వద్ద ఉన్న స్క్రాప్ దుకాణదారుడితో సీఐ మాట్లాడి, పార్కు కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎవరికైనా పోలీసు సహాయం కావాల్సి వచ్చినా, ఎక్కడైనా బహిరంగ మద్యపానం, ఈవ్‌టీజింగ్ , గంజాయి తాగడం వంటి వాటికి పాల్పడినా ఫోన్ నెంబరు : 9490624746కు సమాచారం అందించవచ్చని సూచించారు.

బాధిత కుటుంబానికి ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ఆర్థిక సాయం



ఎమ్మెల్యే వెలగపూడి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విశాఖపట్నం గూడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ సభ్యుడు నాగేశ్వరరావు మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులకు అసోసియేషన్ రూ.లక్ష ఆర్థిక సాయం అందించింది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతుల మీదుగా ఈ సహాయాన్ని అసోసియేషన్ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాసరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

'రాష్ట్ర పారిశ్రామిక చరిత్రకు దశ-దిశ స్టీల్‌ప్లాంటు'

మద్దిలపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పారిశ్రామిక చరిత్రను దశ దిశను మార్చింది స్టీల్‌ప్లాంటేనని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ పేర్కొన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖను ఉక్కునగరంగా, స్టీల్‌సిటీగా పిలుచుకునే స్థాయికి తీసుకెళ్లింది స్టీల్‌ప్లాంటు అన్నారు. అటువంటి స్టీల్‌ప్లాంటును ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు వైట్ ఎలిఫెంట్, ఉద్యోగులు ఇళ్లల్లో పడుకుంటారని కార్మికులను హేళన చేసేలామాట్లాడి అవమానించారన్నారు. స్టీల్‌ప్లాంటు వంటి భారీ పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నారంటే, మిగతా కంపెనీల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు.స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకాకుండా వైసీపీపోరాడుతుందన్నారు.

వ్యాస రచన పోటీలు



వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంవీపీ కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కేవీఏ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు 'గ్రంథాలయాలు-ఉపయోగాలు', 9, 10 తరగతుల విద్యార్థులకు 'ఈవీ వినియోగం, విద్యార్థులపై ప్రభావం' అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. వారోత్సవాలు ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు.ఆ పోటీలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యోతిర్లింగేశ్వరాలయంలో అన్నసమారాధన



వడ్డిస్తున్న వెలగపూడి ప్రతాపరుద్ర

ఆరిలోవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక నాలుగో సోమవారం సందరంగా జీవీఎంసీ 13వ వార్డు శివాజీనగర్‌లో-2లో వెలిసిన జ్యోతిర్లింగేశ్వరాలయంలో అన్నసమారాధనచేపట్టారు. తెలుగుదేశం పార్టీ యువత నేత వెలగపూడి ప్రతాపరుద్ర ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. సుమారు 2 వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కెల్ల సునీతాసత్యనారాయణ, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు, ఆలయం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),

● **జిగ్రీస్** : జగదాంబ

● **శివ, రన్నింగ్ మాన్** : శారదా

● **దే దే ప్యార్ దే** : రమాదేవి

● **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)

● **ది గర్ల్ ఫ్రండ్** :శ్రీకన్య లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచర పాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).

● **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18,టమాటా 40, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 70, బెండకాయలు 56, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 60, బీరకాయలు 54, ఆనపకాయ 36, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 27, క్యారెట్ 56, దొండకాయలు 62, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 52, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 60,కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరుచిక్కుడు 50, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్క కూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

పత్రికలు సమాజానికి ప్రతిబింబం

ఏయూలో జరిగిన సదస్సులో సీనియర్ జర్నలిస్టు జనార్ధనరావు

సిరిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఏయూ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగంలో సోమవారం సెమినార్ నిర్వహించారు. సీనియర్ జర్నలిస్ట్ జనార్ధనరావు హాజరై 'జర్నలిజం ఎథిక్స్' తీరుతెన్నులను వివరించారు. మీడియా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగమైందన్నారు. ప్రభుత్వాలు పారదర్శకంగా పాలన చేయడంలో పత్రికలు కీలక బాధ్యత వహిస్తున్నాయన్నారు.జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి పి.ప్రేమానందం మాట్లాడుతూ ప్రస్తుతం వస్తోన్న మార్పులకు అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. జర్నలిజం కోర్సు ఎంతో ప్రాధాన్యం గలదన్నారు. నైతిక విలువలు ఎంతో ప్రధానమైనవన్నారు.

విద్యార్థులు సబ్జెక్టులో నైపుణ్యం సాధించి, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. సెమినార్‌లో జర్నలిజం విభాగం ఆచార్యులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

హిందూపురం ఘటనపై వైసీపీ నిరసన

సిరిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : హిందూపురంలో పార్టీ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

తమ పార్టీ కార్యాలయంపై టీడీపీ వారే దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గో మాంసం నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

» విశ్వహిందూ పరిషత్ డిమాండ్ » దిబ్బమీదపాలెం సమీపంలో ఉన్న కోల్డ్ స్టోరేజీ వద్ద ధర్నా



కోల్డ్ స్టోరేజీ వద్ద ఆందోళన చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఆనందపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శొంఠ్యాం రెవెన్యూ పరిధిలోని దిబ్బమీదపాలెం గ్రామ సమీపంలో ఉన్న కోల్డ్ స్టోరేజీలో గోమాంసం నిల్వ చేసి, విక్రయాలు జరిపిన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. సోమవారం వారు కోల్డ్ స్టోరేజ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు స్టోరేజ్ లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారంతా గేటు బయట బైఠాయించి నినాదాలు చేయడంతో పోలీసులు అనుమతించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 3వ తేదీన శ్రీమిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో గో మాంసం నిల్వ ఉన్నట్టు అధికారులకు సమాచారం రావడంతో దాడి చేసి, పట్టుకున్నారని చెప్పారు. అడ్డంగా దొరికినా.. స్టోరేజ్‌ను సీజ్ చేయకపోవడంతో కార్యక్రమాలు యథావిధిగా జరుగుతున్నాయని ఆరోపించారు. గో మాంసం నిల్వ ఉన్న చోట వేరే మాంసం మార్చి కేసును తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దీనికి అధికారులు వత్తాసు పలుకుతు న్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు సుబ్రహ్మణ్యం గుప్తాకు చెందిన కంపెనీ కావడంతో కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేసును స్థానిక పోలీసులకు కాకుండా జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు మీసాల రవీంద్ర, పూడిపెద్ది శర్మ, గాడు వెంకటనారాయణ, తమ్మిన నరసింగరావు, ఉప్పాడ అప్పారావు, చక్రవర్తి, విజయ శంకర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నిక



అజయ్



వెంకటరమణ

సిరిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా జి.అజయ్, డి.వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జి.పల్లవి, పి.సాయితేజ, కౌశిక్, నరేష్, మౌనిక, కుసుమాంజలితో పాటు 21 మందిని జిల్లా కమిటీలో సభ్యులుగా ఎన్నుకున్నారు సమావేశానికి హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీలో ఎంపికైనవారికి అభినందనలు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

వెంకోజీపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. సంఘం మాజీ అధ్యక్షుడు మద్దాల శివానందం సహకారంతో గ్రామంలోని పేదలకు దుప్పట్లను అందజేసినట్టు సంఘం అధ్యక్షులు ఆడారి సత్యనారాయణ తెలిపారు.

ఈ సందరంగా సత్యనారాయణ మాట్లాడుతూ తమ సంఘం తరఫున పలు సేవా, సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలియజేశారు. శివాలయం ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పీల ప్రేమ్ కిరణ్ జగదీష్, మాజీ అధ్యక్షుడు మద్దాల వీర వెంకట అప్పారావు, బోర వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయడు (ఆపరేషన్స్) ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వాహణ, చెట్ల నరికివేత పనులు చేపడుతుండడంతో సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విశాలాక్షినగర్, తోటగరువు, బీఎస్ఆర్ నగర్, హనుమంతవాక జంక్షన్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా కళాంజియం దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న చందు, భక్తులు

అక్కయ్యపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాంతినగర్ క్లస్టర్‌లో కళాంజియందినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ క్లస్టర్‌లో ఉన్న 52 గ్రూప్‌లలో సుమారు 750 మంది సభ్యులు పాల్గొన్నారు. ప్రతి సభ్యురాలు బియ్యం, నగదు డొనేషన్ ఇచ్చి తద్వారా వచ్చిన మొత్తాన్ని సగ భాగం పేదవారికి, మిగిలిన భాగం అనాథ శరణాలయానికి అందించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లి చందు, నరసింగరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వారి చేతులమీదుగా బియ్యం, నగదు పేదవారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ పొదుపు సంఘాల వల్ల మహిళల్లో ఆర్థిక స్థితిగతులపై అవగాహన, ఆర్థికాభివృద్ధి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రతినిధులు జి.వెంకటలక్ష్మి, కె.పరదేశమ్మ, ఎం.హరిణి, కొండమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీలాకు కార్పొరేటర్ కవిత శుభాకాంక్షలు


మేయర్ పీలాకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కవిత, గంకల అప్పారావు

కంచరపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ మేయర్ పీలా శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్, 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు పెందుర్తిలో గల పీలా ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపారు. మహా విశాఖనగరాభివృద్ధికి మరింత కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు పాల్గొన్నారు.


మాధవధార : అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు


డాబా గార్డెన్స్ : ఉమాచంద్రమౌళీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు


సీతమ్మధార : పూజలందుకుంటున్న ఉమా నీలకంఠేశ్వర స్వామి

శివాలయాల్లో కార్తీక ప్రత్యేక పూజలు

డాబాగార్డెన్స్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : డాబా గార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలోకార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సురేశ్ బాబా సారథ్యంలో అర్చకుడు భార్గవ శర్మ శైవ ఆగమ సంప్రదాయంలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్చనలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమార్చననిర్వహించారు. పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు పంచాక్షరి మంత్రాన్ని పఠిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. కాగా మంగళశారం సాయంత్రం ఆరు గంటలకు ఆలయ ఆవరణలో ఉమాచంద్రమౌళీశ్వరునికి సామూహిక రుద్రాభిషేకం నిర్వహించ నున్నట్టు ఈవో సురేశ్ బాబా తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అల్లిపురంలోని డీటీకే డాల్ఫిన్‌నోస్, రైల్వే క్వార్టర్స్‌లో లక్ష్మీ వరసిద్ధి వినాయక భవానీ శంకర స్వామి దేవాలయం వద్ద సోమవారం మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు దార్లపూడి శ్రీనివాస శర్మ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తుల అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దాసన సత్యనారాయణ, సారిక కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లిపురం, జ్ఞానాపురంలోని శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు.

మురళీనగర్‌లో..

మురళీనగర్ : సింహాచల దేవస్థానం ఉప దేవాలయమైన పురాతన మాధవధార కొండమీది శ్రీభ్రమరాంబిక మల్లిఖార్జున దేవస్థానంలో వేకువజాము 4 గంటల నుంచే భక్తులు మహా శివుడికి చేపట్టిన అర్చనలు, ప్రత్యేక పూజాభిషేకాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొండమీది ఆలయానికి చేరే దారి మొత్తం వాహనాలతో రద్దీగా మారింది. మురళీనగర్, మాధవధార, ఎన్ఏడీ కొత్తరోడ్డు పరిసర ప్రాంతాలు సహా పలు సుదూర ప్రాంతాల భక్తులు ఇక్కడి ఆలయానికి చేరుకుని పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. సింహాచల ఆలయ సిబ్బంది దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిపారు. మాధవధార హైస్కూలు దగ్గరి శ్రీగౌరీ రామలింగేశ్వరాలయం, 49వ వార్డు సత్యానగర్ శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానాల్లో భక్తుల సందడి కనిపించింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

సీతమ్మధారలో..

సీతమ్మధార, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం, సీతంపేట పార్వతీశ్వరాలయంలో కార్తీక సోమవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివనామ స్మరణ చేపట్టారు. సాయంత్రం ఆలయ ధ్వజ స్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆకాశ దీపం వెలిగించారు. భక్తుల రద్దీతో సందడి నెలకొంది.

సిటీ ఆఫ్ డెస్టినీ.. గూగుల్ సిటీ వైజాగ్

» రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతుంది » కార్పొరేటర్ పీతల గురుమూర్తి యాదవ్



సీతంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 'సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు ముందు.. సమ్మిట్‌కి తరువాత' అన్న రీతిలో రాష్ట్రాభివృద్ధి సాగుతుందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వుమెన్స్ సెక్యూరిటీ దేశంలోనే విశాఖ నెంబర్ వన్‌గా ఉందని, ఆఫ్టర్ రిటైర్మెంట్ బెస్ట్ డెస్టినీ ఇన్ వరల్డ్ అని పేర్కొన్నారు. విశాఖపట్నం బెస్ట్ టూరిస్ట్ స్పాట్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. ఉత్తరాంధ్ర ఐటీ టూరిజం, రాయలసీమ ఆటోమొబైల్ ఏరోస్పేస్‌లో రాయలసీమ, అనకాపల్లి కొత్తగా రెండు పోర్టులు అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు. సుమారు రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు, 15 లక్షల ఉద్యోగ కల్పన విశాఖ పార్టనర్ షిప్ సమ్మిట్ 2025 సాధించిన ఘనత అన్నారు. సిఐఐ భాగస్వామి సదస్సు చూసి వైసీపీ కంట్లో నిప్పులు పోసుకుంటుదన్నారు. ఒప్పందాలు చేసుకున్న కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే వైసీసీని ప్రజలు కోరుకోరని తెలిపారు. మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీల కోసం ప్రయత్నాలు చేసింది చంద్రబాబు అని, రాష్ట్రంలో పెట్టుబడి పెట్టొదని కాగితాలు రాసింది జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను హైటెక్ సిటీ చేశారు, ఈ రోజు విశాఖను గూగుల్ సిటీ చేశారని కొనియాడారు. జగన్‌ను చూసి వెళ్లిపోయిన పారిశ్రామికవేత్తలు తిరిగి వస్తున్నారన్నారు. నారా లోకేష్ సమ్మిట్‌కు ముందే అయిదు కంపెనీలు భూమి పూజ చేశారన్నారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి జగన్, అనుచరులు నోరు పారేసుకుంటున్నారని, కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కల్యాణ్‌ను విమర్శించడం మానుకోవాలని, కోడి గుడ్డు మాజీ మంత్రి అమర్ అని ఎద్దేవా చేశారు. వైసీపీకి 11 సీట్లు ఇచ్చి ఇంట్లో కూర్చో పెట్టారని, ఈలాంటి వేషాలు చేస్తే రాష్ట్రం నుంచి జగన్‌ను తరిమేస్తారన్నారు.,

మాతృమరణాలు సంభవించకుండా చర్యలు

» డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతమ్మధార, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇక ముందు మాతృమరణాలు సంభవించకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారిపై ఉంటుందని, సంబంధిత ఏఎన్ఎం సమయానికి గర్భిణీకి అవసరమైన సేవలను గుర్తించి అందజేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు.. డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో మాతృ మరణాలపై డిస్ట్రిక్ట్ మెటర్నిటీ డెత్ సర్వేలెన్స్, రెస్పాన్స్ కమిటీ సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. గత నెలలో కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒక్కటి, నక్కవానిపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఇక ముందు మాతృమరణాలు జరిగితే చర్యలు తీసుకోబడతాయని, హై రిస్క్ గర్భిణులు ప్రసవానికి వచ్చినప్పుడు కాలయాపన చేయకుండా కేజీహెచ్‌కు, వీజీజీహెచ్‌కు రిఫర్ చేయాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ హెచ్ఆర్‌కె దొర, ఏపీవీవీపీ డాక్టర్ ఉషాప్రసాద్, సూపరింటెండెంట్ వీజీహెచ్ డాక్టర్ లూసీ, డీఐవో డాక్టర్ ఎంవీఈ రమానాయుడు, జనరల్ మెడిసిన్ కేజీహెచ్ డాక్టర్ టీవీఎస్ నాయుడు, బ్లడ్ బ్యాంక్ డాక్టర్ బి.ఉమాపతి, డీపీఎంవో బి.నాగేశ్వరరావు, డెమో డాక్టర్ ఎన్వీ సుమత, డబ్ల్యుహెచ్‌వో ఎం.సత్యవతి, డీపీహెచ్ఎన్వో ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కథా చిత్రం 'విచిత్ర'

డాబాగార్డెన్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అమ్మ గొప్పతనం, కుటుంబ విలువలు ఇతివృత్తంగా తీసిన సినిమా 'విచిత్ర' అని ఆ చిత్ర దర్శక, నిర్మాత సైఫుద్దీన్ మాలిక్ అన్నారు. సోమవారం ఆయన డాబాగార్డెన్స్ డౌన్‌లోని ఓ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిస్ ఫిల్మ్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంటుందని చెప్పారు. హీరోగా రవి, హీరోయిన్‌గా శ్రేయతివారి, జ్యోతి అపూర్వ, బేబీ శ్రీహర్షిణి,యసిక, రవి ప్రకాశ్, సూర్య, ఛత్రపతి శేఖర్, మీనా వాసన్ ముఖ్య పాత్రలుగా చేశారన్నారు. అమ్మ సెంటిమెంట్ నేపథ్యంలో రూపొందించిన ఈ చిత్రంలో తల్లి ప్రేమ, త్యాగం, బంధం గురించి ఉంటుందన్నారు. సెన్సార్ పూర్తయిందని, త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తామని తెలిపారు.

మూర్ఛ వ్యాధి చికిత్సపై అవగాహన సదస్సు

మహారాణిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో సోమవారం ఎపిలెప్సీ (మూర్ఛవ్యాధి) జాతీయ దినోత్సవం నిర్వహించారు. ఆ విభాగ అధిపతి డాక్టర్ ఎస్. గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సింబయోసిస్ సీఈవో నరేశ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు ఎపిలెప్సీ చికిత్స తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, మెంటల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. రామిరెడ్డి, డాక్టర్ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లా విద్యార్థులకు శిక్షణ తరగతులు

డాబాగార్డెన్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో న్యాయశాస్త్ర విద్యార్థులకు సోమవారం నుంచి రిఫ్రెషమెంట్ తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతులను విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డీబీ గంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పి. వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలు, సంస్కరణలు, వాటి పనితీరు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శిక్షణకు అసిస్టెంట్ ప్రొఫెసర్ యుగంధర్ భూపతి అధ్యక్షత వహించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

డాబాగార్డెన్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ మహిళా డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం మొక్కలను నాటారు. కళాశాల ఆవరణలో రుద్రాక్ష, నాగమల్లి, లక్ష్మణ ఫలం, హనుమాన్ ఫలం, వెలగ తదితర అలంకరణ మొక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, వృక్షశాస్త్ర విభాగాధిపతి నివేదిత, అధ్యాపకురాలు లావణ్య పాల్గొన్నారు.

అతివేగమే ప్రమాదాలకు కారణం

మాధవధార, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రవాణా శాఖ, ఆర్‌టీసీ ప్రజా రవాణా శాఖ సంయుక్తంగా బ్రహ్మకుమారీల పిలుపుమేరకు సోమవారం అన్ వరల్డ్ డే ఆఫ్ రోడ్ ట్రాఫిక్ విక్టిమ్స్ పేరుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ రవాణా కార్యాలయం ఇన్‌ఛార్జి డీటీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అతివేగమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి జిల్లా కలెక్టర్, సిటీ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలకు కారణాలను అధ్యయనం చేస్తూ.. నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాద మృతులకు నివాళి అర్పించారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

మహారాణిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అన్నా క్యాంటీన్ పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం ఆయన జడ్పీ మల్లయ్యనాయుడుతో కలిసి కేజీహెచ్ డౌన్‌లోని అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనానికి ఎంతమంది వస్తున్నారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు, క్యాంటీన్ లో ఎక్కడా శుభ్రత లేదని, నిత్యం పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ఆక్వాటిక్ టోర్నీలో విశాఖకు పతకాలు



పతకాలు సాధించిన బాలురుతో జిల్లా స్విమ్మింగ్ సంఘం ప్రతనిధులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల ఆక్వాటిక్ చాంపియన్ షిప్ టోర్నీలో విశాఖ స్విమ్మర్లు నాలుగు స్వర్ణ, ఏడు రజత, తొమ్మిది కాంస్య పతకాలతో 90 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. గ్రూప్-4 బాలుర 100మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో ఎం. రాంకుమార్ వివేక్ రజతం, బాలికల విభాగంలో మన్విత సాయి సరికొండ రజత పతకం, గ్రూప్-5 బాలుర 50మీ. బ్రెస్ట్ స్ట్రోక్‌లో కె. అనయ్ రాజు కాంస్యం, బాలికల విభాగంలో బి. తిక్షిత రెడ్డి రజతం, వానపల్లి గ్రుతిక కాంస్యం, గ్రూప్-4 బాలుర 100మీ. బ్యాక్ స్ట్రోక్‌లో వి.గౌతమ్ పాంచల్ రజతం, 50మీ. బ్యాక్ స్ట్రోక్‌లో పొలిశెట్టి యువగణ చిట్టి రజతం, బాలికల 100మీ. బ్యాక్ స్ట్రోక్‌లో అభిజ్ఞ కాంస్య పతకం, 50మీ. బ్యాక్ స్ట్రోక్‌లో పీతల కింజల్ యాదవ్ స్వర్ణ పతకం సాధించారు. అలాగే గ్రూప్-5 బాలుర 50మీ. బటర్ ఫ్లైలో ఎం. ధ్రువ కాంస్యం, బాలికల విభాగంలో వానపల్లి గ్రుతిక రజతం, గ్రూప్-4 బాలుర 100మీ. ఫ్రీ స్టైల్‌లో వేదాంత్ గౌతమ్ పాంచల్ స్వర్ణం, రియాన్ష్ లోహకరే కాంస్యం, బాలికల 100మీ. ఫ్రీ స్టైల్‌లో మన్విత సాయి సరికొండ స్వర్ణం, గ్రూప్-5 బాలికల 50మీ. ఫ్రీ స్టైల్‌లో రిషిక లంక రజతం, సర్వసిద్ధి సంశిత కాంస్యం, గ్రూప్-4 బాలుర 200మీ. ఐ.ఎం ఈవెంట్‌లో వేదాంత్ గౌతమ్ పాంచల్ స్వర్ణం, బాలికల విభాగంలో మన్విత సాయి సరికొండ కాంస్య పతకం సాధించారు. క్రీడాకారులను జిల్లా స్విమ్మింగ్ సంఘం ప్రతినిధులు మోహన వెంకటరామ్, సంతోష్‌కుమార్ శెట్టి, కార్యదర్శి శ్రీరామమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ. మోహన వెంకటరామ్, కోశాధికారిగా రఘునాథరెడ్డి అభినందించారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు

అనంతుని దీపోత్సవం ఏర్పాట్లపై నార్త్ ఏసీపీ సమీక్ష

పద్మనాభం/పద్మనాభం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంతుని దీపోత్సవానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని మధురవాడ నార్త్ జోన్ ఏసీసీ అప్పలరాజు తెలిపారు. సోమవారం రాత్రి ఆయన కుంతీమాధవస్వామి ఆలయం వద్ద నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. సీపీ ఆదేశాల మేరకు 500 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఉత్సవానికి చేరుకునే మార్గాల్లో మధ్యాహ్నం 1 గంట తరువాత భారీ వాహనాలను దారి మళ్లిస్తామన్నారు. చిన్నాపురం జంక్షన్, నీలకుండీలు జంక్షన్, మహారాజ్‌పేట జంక్షన్ మీదుగా భక్తులు ఉత్సవానికి వస్తారన్నారు. చిన్నాపురం నుంచి బస్సుల్లో వచ్చే వారు అర్చకునిపాలెం వద్ద, మహారాజ్‌పేట జంక్షన్ నుంచి వచ్చే వారిని స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల వద్ద, నీలకుండీలు నుంచి వచ్చే వారిని చెరకు కాటా వద్ద నిలిపివేస్తామన్నారు అక్కడి నుంచి వారు నడిచి ఉత్సవ స్థలానికి చేరుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరా, డ్రోన్ కెమెరాలతో ఉత్సవాన్ని పర్యవేక్షిస్తూ ప్రతి అంశాన్ని జల్లెడ పడతామన్నారు. మెట్లకు వెళ్లే దారిలో ఎటువంటి దుకాణాలు ఏర్పాటు చేయవద్దని, అందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు.మెట్ల మార్గంతో పాటు ఘాట్‌రోడ్డులో వచ్చీపోయే భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉత్సవం రోజున ఘాట్ రోడ్డులో వాహనాలకు అనుమతి లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె. రూపేష్‌కుమార్, సీఐ సీహెచ్ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ సాయి, డీటీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేశ్‌కుమార్, సర్పంచ్ ప్రతినిధి టి. పద్దు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాల వివరాలు

చిన్నాపురం జంక్షన్ నుంచి వచ్చే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు జెడ్పీ అతిథి గృహం వద్ద, బస్సులకు అర్చకునిపాలెం గ్రామం వద్ద పార్కింగ్ స్థలం కేటాయించారు. మహారాజ్‌పేట నుంచి వచ్చేవారు మండల కార్యాలయాల సముదాయం వద్ద, బస్సులకు స్ప్రింగ్ ఫీల్డు పాఠశాల వద్ద. నీలకుండీలు నుంచి వచ్చేవారు పెట్రోల్ బంకు వద్ద తూనిక యంత్రం, గరానా సత్యనారాయణ ఖాళీ స్థలం, బస్సులకు చెరకు కాటా వద్ద పార్కింగ్ స్థలాలు కల్పించారు.

అల్లిపురం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

అల్లిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా సోమవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి బి. కుమార్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ఈ ప్రదర్శనను ప్రారంభించారు. కథలు, విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు, పోటీ పరీక్షలు, సాహిత్యం, తదితర పుస్తకాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని సుజాత, గ్రంథాలయాధికారి వీపీఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్ ; ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి మొబైల్ స్క్రీన్‌లో చదవడాన్ని యువత సులభమైన మార్గంగా భావిస్తున్నా, పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని చదివే అనుభూతే గొప్పదని భీష్మ కళాశాల ఉపాధ్యాయిని పి. కృష్ణవేణి అన్నారు. సోమవారం మురళీనగర్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. సీనియర్లకు టీనేజర్ల మానసిక ఆరోగ్యంపై సోషల్ మీడియా ప్రభావం అన్న అంశంపై, జూనియర్లకు ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గించే మార్గాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ వినియోగించడం ఏ స్థాయి వరకు మంచిది అన్న విషయమై విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ కాలేజీ లెక్చరర్ ఎస్. శశికళ, రిటైర్డ్ మాస్టర్ మూర్తి, లైబ్రేరియన్ వై. పద్మజ పాల్గొన్నారు.


అల్లిపురం శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన


మురళీనగర్ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు

ఈపీడీసీఎల్ పరిధిలో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు

... 5వ పేజీ తరువాయి

బ్యాంకు రుణాలు, ఈఎంఐలు ఇస్తాయన్నారు. వినియోగదారులు పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని, అందులో ఎంప్యానల్ అయిన వెండర్స్ నుంచి సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుకు, నెట్ మీటర్‌కు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటరు పెట్టుకున్న వారికి నెట్ మీటర్ అవసరం లేదని స్పష్టంచేశారు. ఇంకేమైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.

అన్నదాత సుఖీభవ రేపు

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించింది. అర్హులైన ప్రతి రైతు ఖాతాకు రూ.ఐదు వేల వంతున జమ చేయనున్నది. అదే సమయంలో కేంద్రం 'పీఎం కిసాన్' నిధి కింద రూ.రెండు వేలు జమ చేస్తుంది. అంటే ప్రతి రైతుకు రూ.ఏడు వేలు అందనున్నాయి. అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడత విశాఖ జిల్లాలోని నాలుగు మండలాల్లో సుమారు 18 వేల మంది రైతులకు లబ్ధి చేకూరింది. రెండో విడతలో కూడా 18 వేల మందికి అటుఇటుగా ప్రయోజనం చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు. సుమారు రూ.12.5 కోట్ల మేర జమ కానున్నాయని అంచనా వేస్తున్నారు.

ఐబొమ్మ నిర్వాహకుడు ఇంటి వద్ద హడావిడి

... 5వ పేజీ తరువాయి

ఫ్లాట్‌లో పోలీసులు సోదాలు నిర్వహించి కొన్ని హార్డ్ డిస్కులు, పైరసీ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న లింక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రవి స్వస్థలం విశాఖపట్నం కావడంతో పోలీసులు ఇక్కడ కూడా సోదాలు చేయడానికి వచ్చారంటూ నగరంలో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. దీంతో పెదగదిలి ప్రాంతంలో గల రవి నివాసం వద్దకు సోమవారం ఉదయం మీడియా ప్రతినిధులు పెద్దఎత్తున చేరుకున్నారు. అయితే కొద్దిసేపు వేచిచూసి పోలీసులు రాకపోవడంతో వెనుతిరిగారు. అతడి తండ్రి చినఅప్పారావు మాత్రం రవి చేసిన పని తీవ్రమైన నేరమని, 15 ఏళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడని...రెండేళ్ల కిందట ఒకసారి వచ్చివెళ్లాడన్నారు. అతనితో తమకు కనీసం మాట్లాడే పరిస్థితి లేదన్నారు. రవిని పోలీసులు ఏం చేసుకున్నా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

యథేచ్ఛగా గోవధ!

... 5వ పేజీ తరువాయి

ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్పందించి ఆనందపురం మండలం శివారులోని ఒక గోడౌన్‌పై కొద్దిరోజుల కిందట దాడిచేశారు. ఆ సమయంలో సుమారు 189 టన్నుల మాంసం పట్టుబడింది. నమూనాలను తీసి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించగా పట్టుబడిన దాంట్లో అత్యధికం గోమాంసమేనని నిర్ధారిస్తూ నివేదిక పంపినట్టు తెలిసింది. దీనిపై రెండు రోజులు కిందట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా సీపీ శంఖబ్రతబాగ్చికి ఫోన్ చేసి ఆరాతీశారు. దీంతో గోమాంసం కేసు విషయం వెలుగులోకి వచ్చింది. గోవులను వధించడం, అక్రమంగా తరలించడం నేరం కాబట్టి, అలాంటిపనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించినట్టు తెలిసింది. అలాగే అంతపెద్ద మొత్తంలో గోమాంసం ఎక్కడి నుంచి వచ్చింది?, ఎక్కడ వధించారు?, ఎక్కడి నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు?, వాటి రవాణా ఎలా జరుగుతోందనే వివరాలు ఆరా తీసినట్టు తెలిసింది. దీనికి సీపీ స్పందిస్తూ కేసు డీఆర్ఐ దర్యాప్తు చేస్తున్నప్పటికీ పోలీస్ శాఖాపరంగా కూడా వివరాలను ఆరా తీయడంతోపాటు మూలాలను గుర్తిస్తామని డిప్యూటీ సీఎంకు వివరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే పోలీసులు కేసు దర్యాప్తు వేగం పెంచారు. గోమాంసం ఎగుమతిలో ఇతర రాష్ట్రాలకు చెందినవారే కీలకంగా వ్యవహరిస్తున్నట్టు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ఆయా రాష్ట్రాలకు ఇప్పటికే సిబ్బందిని పంపినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా గోవధకు కేంద్రంగా మారిన విశాఖ నగరంలో గోవుల రవాణా, వధకు పూర్తిగా అడ్డుకట్ట వేయడంపై సీపీ దృష్టిసారించాలని గోసంరక్షణ కార్యకర్తలు, హిందూ ధర్మపరిరక్షణ సంఘాలు కోరుతున్నాయి.

ఈపీడీసీఎల్‌లో అడ్డగోలు బదిలీలు

... 5వ పేజీ తరువాయి

ఈ బదిలీలు చేశామని ఉత్తర్వుల్లో ఎస్ఈ పేర్కొన్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులు ఎవరూ వీరి బదిలీల కోసం సిఫారసు చేయలేదు. లేఖలూ రాయలేదు.

ఆ విషయం కార్పొరేట్ కార్యాలయానికే తెలియదు

అనకాపల్లి సర్కిల్‌లో జరుగుతున్న బదిలీల విషయం పక్కనే విశాఖలో ఉన్న కార్పొరేట్ కార్యాలయానికి కూడా తెలియడం లేదు. ఆ సమాచారం ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఏళ్లుగా పనిచేస్తున్న ముగ్గురు మహిళలు పి.విజయప్రభ, వి.విజయలక్ష్మి, విష్ణుప్రియలను జిల్లా ఉన్నతాధికారి 40 రోజుల క్రితం బదిలీ చేశారు. ఈ విషయం తెలియక ఇటీవల సీఐఐ పెట్టుబడిదారుల సదస్సుకు డ్యూటీలు వేసినప్పుడు ఆయా మహిళా అధికారులు పూర్వపు స్థానాల్లోనే ఉన్నారనుకొని ఆ విధంగానే ఉత్తర్వులు జారీ చేశారు. ఇది చూసి సర్కిల్ అధికారులు అంతా ఆశ్చర్యపోయారు. ఏ విషయం కార్పొరేట్ కార్యాలయానికి చెప్పడం లేదనే విషయం బయటపడింది.

పనితీరులో అట్టడుగున...

అనకాపల్లి జిల్లాకు ఇటీవల అధిక ప్రాధాన్యం ఏర్పడింది. పెద్ద పెద్ద పరిశ్రమలన్నీ వస్తున్నాయి. అయితే వినియోగదారుల నుంచి ప్రతి నెలా తీసుకునే ఫీడ్ బ్యాక్ ప్రకారం చూసుకుంటే ఈ జిల్లా అట్టడుగున ఉంటోంది. విద్యుత్ సరఫరా సరిగ్గా ఉండడం లేదని, ఫిర్యాదులు చేస్తే సకాలంలో స్పందించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గత ఐదు నెలల నుంచీ ఈ జిల్లా అట్టడుగున ఉందని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ముఖ్యంగా మాడుగుల, రావికమతం మండలాల నుంచి అధిక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆకస్మిక బదిలీలపై అనకాపల్లి ఎస్ఈ జి.ప్రసాద్‌ను వివరణ కోరగా, పరిపాలన అవసరాల కోసమే చేపడుతున్నామన్నారు. కార్పొరేట్ కార్యాలయానికి కూడా సమాచారం ఇస్తామని పేర్కొన్నారు.

పర్యాటక ప్రాజెక్టుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

సంస్థ ఎంఓయూ చేసింది. సుమారుగా ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ అధినేత తిరుపతిరాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దాదాపు రూ.45 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ వెల్‌నెస్ సెంటర్‌లో 170 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

- వరల్డ్ బ్లిస్ అనే సంస్థ కూడా ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్, అడ్వంచర్ అండ్ ఎకో టూరిజం సెంటర్ ఏర్పాటుకు ఎంఓయూ చేసింది. వీరు రూ.100 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఏ ప్రాంతంలో అనేది ఇంకా ఖరారు కాలేదు.

నవతరం సినీ స్టూడియో

రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైనది ఉమ్మడి విశాఖ జిల్లానే. విశాఖపట్నం, భీమిలి, గంగవరం, అప్పికొండ, యారాడ, కొండకర్ల ఆవ ప్రాంతాలతో పాటు అరకు, లంబసింగి తదితర చోట్ల కొన్ని దశాబ్దాలుగా సినిమా షూటింగ్‌లు జరుగుతున్నాయి. విశాఖలో సినిమా స్టూడియోలు ఏర్పాటు చేయడానికి చాలామంది ఆసక్తిగా ఉన్నారు. ప్రభుత్వాన్ని భూములు కూడా కోరుతున్నారు. తాజాగా జరిగిన సదస్సులో నవతరం సినీ స్టూడియోస్ సంస్థ స్టూడియో ఏర్పాటుకు ఎంఓయూ చేసింది. రూ.100 కోట్ల పెట్టుబడితో ఐదు వేల మందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొంది. ఎక్కడ అనేది ఇంకా స్పష్టత రాలేదు. భూమి కేటాయింపులపై చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.

- కల్చరల్ కారవాన్ ఇండియా అనే సంస్థ కూడా స్టూడియో ఏర్పాటుకు ఒప్పందం చేసింది. భూమి కేటాయిస్తే రూ.60 కోట్ల పెట్టుబడితో 25 మందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొంది.
- సాగర్‌నగర్‌లో పర్యాటక శాఖ భవనంలో సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ నడుపుతున్న జాస్తి శ్రీకాంత్ స్టార్ హోటల్ ఏర్పాటు చేయడానికి ఎంఓయూ చేశారు. రూ.150 కోట్ల పెట్టుబడితో 2,500 మందికి ఉద్యోగాలు ఇస్తామని పేర్కొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 10 ఫిర్యాదులు

వేపగుంట నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా 92వ వార్డు వెంకటాపురంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, తమ స్థలంలో రోడ్డు వేయొద్దని, 93వ వార్డు కృష్ణానగర్‌లో కాలువ నిర్మాణం పూర్తి చేయాలని, 95వ వార్డు శేషాద్రినగర్‌లో వీధి దీపాల సమస్య పరిష్కరించాలని, లక్ష్మీపురంలో సీసీ రోడ్లు నిర్మించాలని, 97వ వార్డు టీచర్స్ లేఅవుట్‌లో డ్రైనేజి సమస్య పరిష్కరించాలని, పాపయ్యరాజుపాలెంలో పశువుల పెంపకం వల్ల కలిగే ఇబ్బందులను తొలగించాలని చినముషిడివాడ రహదారుల నిర్మాణం చేపట్టాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖాధిపతులకు పంపిస్తామని జడ్సీ హెచ్.శంకరరావు తెలిపారు

గాజువాకలో 13 వినతులు

గాజువాక: గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 13 వినతులు అందాయి. ముఖ్యంగా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, వీధి లైట్లు వేయాలని, కుక్కల బెడద నివారించాలని, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలని వంటి వినతులు అందాయి. జోనల్ కమిషనర్ శేషాద్రి వినతులు స్వీకరించి, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖాధికారులకు సూచించారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 69వ వార్డు వైసీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో తుంగ్లాం కాలనీలో సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు పోడియం వితరణ

గాజువాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇస్లాంపేట హైస్కూల్‌కు ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డీఎస్.మూర్తి అదే పాఠశాలకు సోమవారం పోడియాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రమీల మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు సాయం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గోపాలపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తిని వీడాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాల్లో పాల్గొన్నా కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లకు సీఐ. ఎల్.సన్యాసినాయుడు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచిగా మెలగాలని, నేరాలకు పాల్పడడం వల్ల వ్యక్తిగత, కుటుంబ జీవితాలు నాశనమవుతాయని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 89వ వార్డు ఎల్లపువానిపాలెం గ్రామంలో రూ.20లక్షలలో నిర్మించనున్న రహదారులు, డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని అన్ని ప్రాంతాల్లో దశలవారీగా మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు చేపడతామన్నారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి(మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతా రామయ్య (పరవాడ),
- **జిగ్రీస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రెండ్** : శ్రీకన్య, లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 40, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 70, బెండకాయలు 56, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 60, బీరకాయలు 54, ఆనపకాయ36, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 27, క్యారెట్ 56, దొండకాయలు 62, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 52, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 50, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234



కూర్మన్నపాలెం: చామంతి పూల అలంకరణలో శివలింగం



స్టీల్‌ప్లాంట్ పురాతన శివాలయంలో మంచు లింగం



అగనంపూడి: నంది వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పెందుర్తి: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా కిటకిటలాడిన ఆలయాలు
- గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో పోటెత్తిన భక్తులు

కూర్మన్నపాలెం,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని 70, 86, 87 వార్డుల్లోని శివాలయాలను శివనామస్మరణతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా మాతృశ్రీనగర్‌లోని విశ్వేశ్వర దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, చామంతి పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామివారికి పూజలు చేశారు. అలాగే కణితి కాళింగుల వీధిలో పంచముఖేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి సామూహిక పూజలు, హోమాలు నిర్వహించారు. 87వ వార్డు వడ్లపూడిలో సీతారామ లింగేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మసూత్ర శివలింగానికి ప్రత్యేక అలంకరణ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 70వ వార్డు ఆటోనగర్ దరి తోకాడ శివాలయంలో దుర్గా మల్లికార్జున స్వామి ఆలయంలో స్ఫటిక శివలింగానికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'ఉక్కు' శివాలయంలో..

ఉక్కుటౌన్‌షిప్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న పురాతన శివాలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునుంచే ఆలయానికి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధని నిర్వహించారు. ప్లాంట్‌కు పూర్వ వైభవం రావాలని, ఉద్యోగులకు మంచి జరగాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అగనంపూడి పరిసర ప్రాంతాల్లో..

అగనంపూడి: కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా అగనంపూడి, పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా పెదమడక ఉమామహేశ్వర ఆలయం, పాత అగనంపూడి, కర్రివానిపాలెం, జాబిలి హిల్స్ ప్రాంతాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

ఎమ్మెల్యే పంచకర్ల ప్రత్యేక పూజలు

పెందుర్తి: కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. సరిపల్లిలో ఉన్న స్వయంభు శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. పినగాడి చోడేశ్వర స్వామి శివాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు పరత్యేక పూజలు చేశారు. ప్రశాంతినగర్, సుజాతనగర్, చినముషిడివాడ, ఉడాకాలనీ, రత్నగిరి నగర్, వెంకటాద్రి శిఖరం సాధూమఠం ప్రాంతాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రసన్నగిరిపై..

అక్కిరెడ్డిపాలెం: కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా 68, 69 వార్డుల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. షీలానగర్, అక్కిరెడ్డిపాలెంలో, తుంగ్లాం, నాతయ్యపాలెం ప్రాంతాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై వినాయక మందిరంలో స్వామివారికి తమల పాకులు, దోసకాయలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సదరం క్యాంపును వినియోగించుకోండి

- పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సదరం లోకోమోటర్ హెల్త్ క్యాంప్‌ను వినియోగించుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. సామాజిక ఆరోగ్య కేంద్రలో లోకోమోటర్ హెల్త్ క్యాంపును సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం హెల్త్ క్యాంప్‌ను గోపాలపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరగా ఏపీ సెకండరీ హెల్త్ డైరెక్టర్ స్పందించి తక్షణమే ఇక్కడ సదరం క్యాంపును ఏర్పాటు చేశారని అన్నారు. దీంతో స్థానికుల ఇబ్బందులు తీరాయని అన్నారు. సదరం సర్టిఫికేట్ల కోసం సచివాలయాల్లో స్లాట్‌బుక్ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన ప్రారంభించినా తప్పని ట్రాఫిక్ తిప్పలు



ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

మల్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్‌యార్డు సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన ప్రారంభమైనప్పటికీ ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా ఈ వంతెనపై నుంచి ఒక వైపే ప్రయాణానికి వీలు ఉండడం, నగరం నుంచి వచ్చే సమయంలో చుట్టూ తిరిగి రావడం వల్ల ప్రయాణికుల కష్టాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఈ రహదారిలో ప్రయాణించే సమయంలో మూడు రైల్వే గేట్లు ఉన్నాయి. సోమవారం రాత్రి డాక్‌యార్డు సమీపంలో గూడ్స్ రైళ్ల రాకపోకల వల్ల సుమారు కిలోమీటరు దూరం ట్రాఫిక్ నిలిచిపోయింది. దీని వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎస్ఆర్ కంపెనీ వద్ద పోర్టు వంతెన నిర్మాణం జరుగుతోంది. ఈ వంతెన పూర్తయితే నగరం నుంచి వచ్చే వాహనాలు కూడా సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనపై నుంచి వెళ్లడానికి వీలు ఉంటుంది. దీంతో వంతెన నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

'విద్యార్థులు ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి'

అగనంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వరులు పిలుపునిచ్చారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో 'వికసిత్ భారత్ 2025 యంగ్ లీడర్స్' కార్యక్రమంలో 'టెక్ ఫర్ వికసిత్ భారత్- క్వాంటమ్ కంప్యూటరింగ్' అనే అంశంపై సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతకు అత్యాధునిక టెక్నాలజీపై శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నట్టు పేర్కొన్నారు. క్వాంటమ్ కంప్యూటరింగ్ ప్రవేశం తర్వాత డేటా విశ్లేషణలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయన్నారు. అనంతరం విజ్ఞాన్ కళాశాల ప్రముఖ క్వాంటమ్ కుబిటెక్ పరిశోధన సంస్థతో ఎంఓయు చేసుకుంది.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- గండి బాబ్జీ



తహసీల్దార్ వెంకట అప్పారావుకు వినతి పత్రం అందజేస్తున్న గండి బాబ్జీ తదితర నాయకులు

పెందుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. పెందుర్తిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తకు ఏ ఆపద వచ్చినా వారి ఇంటి ముందుంటానని అన్నారు. అధికారులు టీడీపీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు తెచ్చిన సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు. అనంతరం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలతో కలిసి తహశీల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్లను బాబ్జీ సందర్శించారు. గ్రీవెన్స్ వినతులను తహశీల్దార్ వెంకట అప్పారావు, ఎంపీడీవో అప్పలరాజు, సీఐ కేవీ సతీశ్‌కుమార్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తాం

ఉక్కుటౌన్‌షిప్: టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని 77వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మంత్రి రవి, కార్యవర్గ సభ్యులు అన్నారు. పెందుర్తి నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీని సోమవారం వీరు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యకర్తల కోసం పార్టీ చేపడుతున్న సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి గండి బాబ్జీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు

పారిశుధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ

గాజువాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 66వ వార్డులో పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనే, సబ్బులు, భద్రత దుస్తులు, యూనిఫాం, టవల్స్‌లను టీడీపీ వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డును పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య సిబ్బందికి నివాసితులు చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు ప్రశాంతినగర్ సచివాలయం వద్ద కార్పొరేషన్ నిధులతో పారిశుధ్య కార్మికులకు సోమవారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్మికులంతా చిత్త శుద్ధితో గ్రామాల అభివృద్ధికి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ఉచ్చులో 'స్టీల్' వామపక్ష సంఘాలు

- టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్టీల్‌ప్లాంట్‌కు రూ.14వేల కోట్ల భారీ ప్యాకేజీ ఇచ్చి ప్లాంట్‌ను ప్రభుత్వం ఆదుకున్నదని టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణను వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమరించారు. వైసీపీ ఉచ్చులో చిక్కుకున్న వామపక్షాలు చంద్రబాబుపై అవాకులు, చవాకులు మాట్లాడటం ద్వంద్వనీతికి నిదర్శనమన్నారు. ప్లాంట్‌ను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు అంటే ఎంతో గౌరవమన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ

అగనంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కల్పించడమే లక్ష్యంగా విజ్ఞాన్ సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్ తదితర అంశాల్లో నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు.

గో మాంసం నిల్వ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- విశ్వహిందూ పరిషత్ డిమాండ్
- దిబ్బమీదపాలెం గ్రామ సమీపంలో ఉన్న కోల్డ్ స్టోరేజ్ వద్ద ధర్నా



కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆందోళన చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఆనందపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శొంఠ్యాం రెవెన్యూ పరిధిలోని దిబ్బమీదపాలెం గ్రామ సమీపంలో ఉన్న కోల్డ్ స్టోరేజ్‌లో గోమాంసం నిల్వ చేసి, విక్రయాలు జరిపిన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. సోమవారం వారు కోల్డ్ స్టోరేజ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు స్టోరేజ్ లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారంతా గేటు బయట బైఠాయించి నినాదాలు చేయడంతో పోలీసులు అనుమతించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 3వ తేదీన శ్రీమిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో గో మాంసం నిల్వ ఉన్నట్టు అధికారులకు సమాచారం రావడంతో దాడి చేసి, పట్టుకున్నారని చెప్పారు. అడ్డంగా దొరికినా.. స్టోరేజ్‌ను సీజ్ చేయకపోవడంతో కార్యక్రమాలు యథావిధిగా జరుగుతున్నాయని ఆరోపించారు. గో మాంసం నిల్వ ఉన్న చోట వేరే మాంసం మార్చి కేసును తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దీనికి అధికారులు వత్తాసు పలుకుతు న్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు సుబ్రహ్మణ్యం గుప్తాకు చెందిన కంపెనీ కావడంతో కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేసును స్థానిక పోలీసులకు కాకుండా జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు మీసాల రవీంద్ర, పూడిపెద్ది శర్మ, గాదు వెంకటనారాయణ, తమ్మిన నరసింగరావు, ఉప్పాడ అప్పా రావు, చక్రవర్తి, విజయ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత మార్చ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కరణం రెడ్డి నరసింగరావు

ఘనంగా 'ఐక్యత మార్చ్'

గాజువాక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు గాజువాకలో సోమవారం ఐక్యత మార్చ్‌ను మై భారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మార్చ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి యువతకు ఆదర్శనీయుడని పేర్కొన్నారు. అఖండ భారతావని కోసం 565 సంస్థానాలను విలీనం చేశారన్నారు. ఐక్యతకు చిహ్నంగా నర్మదా నది ఒడ్డున 182 అడుగుల పటేల్ విగ్రహాన్ని నెలకొల్పారని అన్నారు. బీజేపీ కన్వీనర్ నరసింగరావు మాట్లాడుతూ దేశంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు.కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేపగుంట పినగాడి రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే



రోడ్డును పరిశీలిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీఎమ్ఆర్‌డీఏ రూ.14.5 కోట్లతో నిర్మాణం చేపట్టిన 60 అడుగుల వేపగుంట పినగాడి రోడ్డును ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి పనులపై అధికారులు ఆరా తీశారు. అనంతరం పినగాడి జంక్షన్ నుంచి లక్ష్మీపురం వరకు చేపట్టిన తొలిదశ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ అయితి సింహాచలం, బయిలపూడి హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీలకు సత్కారం



కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 14, 15 తేదీలలో భాగస్వామ్య సదస్సు విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌లను జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం దుశ్శాలువాలతో సత్కరించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం వేదికగా వారిని సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు మాట్లాడుతూ సదస్సు విజయవంతం కోసం అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ అధికారులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఇదే సందర్భంలో పీజీఆర్ఎస్‌కు వచ్చిన అధికారులంతా కరతాళ ధ్వనులతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పాలనాధికారి బీవీ రాణి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యాంప్రసాద్, రాష్ట్ర క్రీడా కార్యదర్శి రాజేంద్రవర్మ, ప్రతినిధులు యోగి, రవి ప్రకాశ్, కిశోర్, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- గ్రంథాలయ వారోత్సవాల్లో ఎంఈవో కె.రమణాజీ

పెదగంట్యాడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారి కె.రమణాజీ అన్నారు. జాతీయ గ్రంథాలయవారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణ, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని రకాల పుస్తకాలతో కూడి గ్రంథాలయాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై తహశీల్దార్‌కు వినతి

కూర్మన్నపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86 వార్డు లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలపై దృష్టి సారించి, వాటిని పరిరక్షించాలని గాజువాక తహశీల్దార్ టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. వినతిలో భాగంగా వైసీపీ హయాంలో ప్రభుత్వ భూములు అడ్డగోలుగా ఆక్రమణకు గురయ్యాయన్నాఉ. వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీతాలపై ఆంక్షలు ఎత్తివేయండి

- ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి ఆధారంగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం సరికాదని, యాజమాన్యం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్ పరిపాలన భవనం జంక్షన్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. కార్మికులకు చెల్లించాల్సి జీతాలపై యాజమాన్యం అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటోందని కార్మిక నాయకులు ఆరోపించారు. ఉత్పత్తికి తగ్గా ముడి సరకును సమకూర్చడంలో యాజమాన్యం విఫలమైందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలకు ఇచ్చిన హామీలపై చిత్తశుద్ధి ఉందా? అని ప్రశ్నించారు. చట్టాల్లో లేని అంశాలను యాజమాన్యం కార్మికులపై అమలు చేసి దాడులకు దిగుతుందన్నారు.

గర్భిణులకు ఐరన్ టానిక్‌లు పంపిణీ

అగనంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ సౌత్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం వంద మంది గర్భిణులకు ప్రొటీన్ పౌడర్, ఐరన్ టానిక్‌లను పంపిణీ చేశారు. క్లబ్ జిల్లా గవర్నర్ కల్యాణ్‌చక్రవర్తి ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యం కోసం రోటరీ క్లబ్ ప్రతీ నెల ప్రోటీన్ పౌడర్, ఐరన్ టానిక్‌లన అందజేస్తోందని అన్నారు . వైద్యులు ఇచ్చే సలహాలు, సూచనలు తప్పకుండా పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

అక్కిరెడ్డిపాలెంలో కాలనీ పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం లోని రైల్వే ట్రాక్ దగ్గర ఉన్న కాలనీని కార్పొరేటర్ గుడివాడ అనూష, పలువురు నాయకులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, స్థానిక రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న డ్రైనేజీని వారు పరిశీలించారు. అనంతరం కాలనీలోని చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు కొరకు స్థలాలను పరిశీలించారు.

ఉద్యమించేందుకు కార్మిక సంఘాలు సిద్ధం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తితో ముడిపన జీతాల ఉత్తర్వులకు వ్యతిరేఖంగా ఉద్యమాలు చేసేందుకు కార్మిక సంఘాలు సిద్ధంగా ఉన్నాయని కార్మిక నాయకులు తెలిపారు. ఈ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని, ఉద్యోగులపై వేసిన నిందలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 19న ఉక్కు ఉద్యోగులు డిమాండ్ బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరుకానున్నారని, 20న బీసీ గేటు వద్ద భారీ ధర్నా చేయాలని, 23న జీవీఎంసీ ఎదుట ధర్నా చేయడానికి నిర్ణయించామని పోరాట కమిటీ నాయకు లు తెలిపారు. యాజమాన్యం వెనక్కి తగ్గకపోతే ఉద్యమాన్ని త్రీవం చేస్తామన్నారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంవీపీ కాలనీలోని సర్దార్ గౌతులచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్ కె.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారు తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షలోపు ఉంటే ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రెండు ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్, పాన్ తదితర జెరాక్స్ కాపీలతో ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరులో ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఇవ్వాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు విజయవాడ గొల్లపూడిలోని బీసీభవన్‌లో శిక్షణ ఇస్తారన్నారు.

సరకు లోడింగ్‌లో వాల్తేరు డివిజన్ సరికొత్త రికార్డు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సరుకు లోడింగ్‌లో వాల్తేరు డివిజన్ సరికొత్త రికార్డు నెలకొల్పిందని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది నవంబరు 16 నాటికి (వార్షిక సంవత్సరంలో 230 రోజుల్లో) 50 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్ చేసి గత ఏడాదితో పోల్చితే 12.5 శాతం ప్రగతి సాధించిందన్నారు. 2023-24 వార్షిక సంవత్సరంలో 50 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్‌కు 256 రోజులు పట్టగా...ప్రస్తుతం కేవలం 230 రోజుల్లోనే 50 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్‌ను పూర్తి చేయడం విశేషమన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ సిబ్బంది కృషి అభినందనీయమన్నారు.

మద్యం మత్తులో యువత చిత్తు!

- బానిసలుగా మారుతున్న వైనం
- మానసిక ఆస్పత్రిలోని డీ అడిక్షన్ వార్డుకు భారీగా బాధితులు
- కౌన్సెలింగ్, ఫ్యామిలీ, బిహేవియర్ థెరపీ ఇస్తున్న వైద్యులు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):

'శ్రీకాకుళం జిల్లాకు చెందిన 21 ఏళ్ల యువకుడు మద్యానికి బానిసయ్యాడు. కొద్ది నెలలుగా తాగుడు మరింత పెరిగింది. అప్పులు చేయడం, దొరక్కపోతే దొంగతనాలు చేసేవాడు. పరిస్థితి అదుపు తప్పుతోందని గుర్తించిన తల్లిదండ్రులు దారికి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోయింది. వారి మాట కూడా వినని స్థితికి చేరుకున్నాడు. దీంతో పెదవాల్తేరులోని మానసిక ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స అనంతరం కోలుకుని ప్రస్తుతం సాధారణ స్థితికి వచ్చాడు'.



కొన్నాళ్లుగా మానసిక ఆస్పత్రిలోని డీ అడిక్షన్ వార్డులో ఈ తరహా సమస్యలతో చేరుతున్న వారి సంఖ్య పెరిగింది. సుమారు 30 ఏళ్లలోపు యువత మద్యానికి బానిసలుగా మారి ఇబ్బందికర స్థితిలో ఆస్పత్రికి వస్తున్నారు. ప్రాథమిక దశలో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు పట్టించుకోకపోవడంతో మద్యానికి బానిసలవుతున్నారు. ప్రతి నాలుగు కేసుల్లో ఒకటి ఈ తరహాదేనని వైద్యులు చెబుతున్నారు. ప్రతి ఆరుగురిలో 20 నుంచి 30 ఏళ్లలోపు వయసున్న వారు ముగ్గురు ఉంటున్నారని చెబుతున్నారు.

ఇవీ లక్షణాలు..

మద్యానికి బానిసలవడానికి కొంత సమయం పడుతుంది. ప్రాథమిక దశలో పార్టీల్లో తాగడం, స్నేహితులతో చిల్ అవ్వడం ద్వారా అలవాటు చేసుకుంటారు. ఆ తరువాత సరదాగా తాగే ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ రెండు దశల్లో వారిని అలవాటుకు దూరం చేయగలిగితే ఫలితం ఉంటుంది. తరువాతి దశకు చేరుకుంటే దానిని అలవాటుగా మార్చుకుంటారు. ప్రతిరోజూ తాగడం, అప్పులు, కొన్నిసార్లు దొంగతనాలు చేస్తారని నిపుణులు చెబుతున్నారు. మద్యం సేవించకపోతే ప్రవర్తనలో మార్పులు, మానసిక ఆందోళన, వణుకు, భ్రమ, మూర్ఛ వంటి ఇబ్బందులు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.

కోలుకునేందుకు అవకాశం..

ఈ తరహా లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. వారికి రక్త పరీక్షలు నిర్వహించి కాలేయం, ఇతర అవయవాల పనితీరును చూస్తారు. కౌన్సెలింగ్‌తో పాటు ఫ్యామిలీ థెరపీ, బిహేవియర్ థెరపీ అందించి కోలుకునేలా చేస్తారు. ఇందుకోసం రెండు నుంచి మూడు వారాలపాటు బాధితులు ఆస్పత్రిలో చేరాల్సి ఉంటుంది. ఈ వార్డులో ప్రతిరోజూ 30 నుంచి 35 మంది ఈ తరహా సమస్యలతో చేరుతున్నారని చెబుతున్నారు.

పిల్లల వ్యవహారశైలిని గుర్తించాలి



పిల్లలు ఇటీవల దురలవాట్లకు బానిసలుగా మారుతున్నారు. చిన్న వయసులోనే మద్యానికి అలవాటుపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. తల్లిదండ్రులు సకాలంలో గుర్తించి తీసుకువస్తే సాధారణ స్థితికి తెచ్చే వీలుంది. ఏ స్టేజ్‌లో ఉన్నారో గుర్తించి అవసరమైన వైద్య సేవలతోపాటు కౌన్సెలింగ్, థెరపీలు ఇస్తాం. వీరికోసం ప్రత్యేకంగా వార్డుంది. రెండు నుంచి మూడు వారాల్లో సాధారణ స్థితికి వస్తారు.

- డాక్టర్ రామిరెడ్డి, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్

క్రైం... crime news

డిఫెన్స్ మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

ఎంవీపీ కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : డిఫెన్స్‌కు చెందిన పన్నెండు మద్యం సీసాలతో ఉన్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నర్సీపట్నానికి చెందిన ఎ.జనార్దన్, బి.గిరిప్రసాద్‌లు మద్దిలపాలెం వద్ద ఉండగా, వారి నుంచి డిఫెన్స్ మద్యం బాటిళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులను ఎంవీపీ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలో ఓ ఇంట్లో కేర్ టేకర్‌గా పని చేస్తున్న వ్యక్తి అదృశ్యం అయిన సంఘటనలో ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎంవీపీ కాలనీలో నివాసం ఉంటున్న రాధా రాజాభూషణ్ ఇంట్లో రెండేళ్లుగా పని చేస్తున్న కె.నవీన్ (33) ఈ నెల 4న అరకు వెళ్తానని మోటారు బైకుపై వెళ్లాడు. తర్వాత ఇంటికి చేరలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. పలుచోట్ల ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు వెంకటాజాయ కుమార్

సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు లండగరువులోని మామిడి తోటలో జె. వెంకటాజాయ కుమార్ (55) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోపాలపట్నం సీఐ నాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆరిలోవలోని వివేకానంద నగర్‌కు చెందిన కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు. అక్కడే పాన్ షాపు నిర్వహిస్తున్న ఆయన సోమవారం ఉదయం బైక్‌పై ఇంటి నుంచి వెళ్లిపోయి సాయంత్రం వరకు చేరలేదు. కుటుంబీకులు సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా వెతగ్గా సింహాచలం ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయాన్ని గోపాలపట్నం పోలీసులకు తెలపడంతో వారు లండగరువు మామిడి తోటలో మృత దేహాన్ని గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

అక్రమంగా చొరబడిన బంగ్లాదేశీయుడి అరెస్టు

- సెంట్రల్ జైలుకు తరలింపు



విక్రమ్ అలీ (ఫైల్‌ఫొటో)

కొత్తూరు (అనకాపల్లి జిల్లా), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి పాస్‌పోర్టు, వీసా లేకుండా భారతదేశంలోకి చొరబడిన బంగ్లాదేశ్ వాసిని అరెస్టు చేసినట్టు అనకాపల్లి పట్టణ సీఐ జి.ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని (ఒక పురుషుడు, బాలిక)ను ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించి పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్‌కు సమాచారం అందించాయన్నారు. దీంతో సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, బంగ్లాదేశ్‌కు చెందిన విక్రమ్ అలీ అలియాస్ మహ్మద్‌గా తేలిందన్నారు. అతను 2012లో సరిహద్దు దాటి ఇండియాలోకి చొరబడి ఉత్తరప్రదేశ్ దగ్గర అలీగఢ్‌కు చేరుకొని అక్కడ పదేళ్లు నివాసం ఉన్నాడన్నారు. ఆ తరువాత కాకినాడ ప్రాంతానికి చేరుకున్నాడన్నారు. కాగా రెండు నెలల క్రితం బంగ్లాదేశ్ నివాసి అయిన బాలికను పెళ్లి చేస్తానని నమ్మించి బోర్డర్ దాటించాడన్నారు. విక్రమ్ అలీని న్యాయస్థానం ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్ నిమిత్తం విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామని సీఐ తెలియజేశారు. బాలికను సంరక్షణ నిమిత్తం హోమ్‌కు పంపామన్నారు.

అప్పన్నను దర్శించుకున్న మాధవ్ దంపతులు



కప్పస్తంభం వద్ద మాధవ్ దంపతులు

సింహాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దంపతులు దర్శించుకున్నారు. సోమవారం అప్పన్న దర్శనానికి వచ్చిన మాధవ్‌కు ఆలయ ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు అధికారిక మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న దంపతుల గోత్రనామాలతో అర్చకులు అంతరాలయంలో పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత ఆలయ పండితులు చతుర్వేద మంత్రాలతో ఆశీర్వచనాలీయగా, ఏఈఓ ప్రసాదాలను అందజేశారు.

మార్గశిర మాసోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



కనకమహాలక్ష్మి ఆలయం వద్ద మార్గశిర మాసోత్సవ ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో ఈవో కె.శోభారాణి

మహారాణిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు వివిధ శాఖలు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. ఈ నెల 21 నుంచి బురుజు పేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆలయం వద్ద చేపడుతున్న ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ పరిశీలించి తగిన సూచనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఏర్పాట్లు పరిశీలించాక మరోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తానన్నారు. సమావేశంలో ఆలయ ఈవో కె.శోభారాణి, కమిషనర్ కేతన్‌గార్గ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 382 అర్జీల స్వీకరణ

మహారాణిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అందించే అర్జీల విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శకుల నుంచి 382 అర్జీలు స్వీకరించారు. అందిన వినతులలో రెవెన్యూ విభాగానికి సంబంధించి 140, జీవీఎంసీ 98, పోలీసు 38, ఇతర శాఖల నుంచి 106 ఉన్నాయి. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్ అర్జీలను క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో అధికారులు తప్పనిసరిగా మాట్లాడుతూ, సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అర్జీలు స్వీకరించినవారిలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిప్యూటీ కలెక్టర్ సత్తిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు

మత్స్యకార్మిక సంఘం ఆందోళన

కేసుల పట్ల వన్‌టౌన్ పోలీసులు అలసత్వం ప్రదర్శించడం అన్యాయమని ఏపీ మత్స్య కార్మిక సంఘం ఆరోపించింది. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టింది. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పోలీసుల ఉదాసీనత, నిర్లక్ష్యం కారణంగా నిందితులు నిర్భయంగా తిరుగుతున్నారని ఆరోపించారు. న్యాయం చేయకపోతే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల అక్రమ నియామకాలపై జిల్లా న్యాయమూర్తితో విచారణ జరిపించాలని విదసం ఐక్య వేదిక డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించిన అనంతరం సంఘం ప్రతినిధి బి.వెంకటరావు మాట్లాడుతూ ఏయూలో ఏడేళ్లుగా ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు.



బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో అవినీతిపై న్యాయవిచారణకు డిమాండ్

తప్పుడు నియామకాల కారణంగా ఏయూ ప్రతిష్ఠ మసకబారిందన్నారు. ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలు ఉన్న 28 మంది మాత్రమే ఎంపిక కావడం వెనుక అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. దరఖాస్తుదారుల మెరిట్ లిస్టు ప్రకటించలేదని తెలిపారు. తక్షణమే ఈ నియామక పత్రాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వభూములను పరిరక్షించండి

నగర పరిధి మాధవధారలో సర్వేనంబరు 9/1లో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, ఇప్పటికే అక్కడ నిర్మించిన ఆక్రమణలు తొలగించాలని మాధవధారకు చెందిన శివకుమార్ తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. కొందరు దళారులు అక్కడ కొంత భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని, అధికారులు వాటిని తొలగించేందుకు వెళితే బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వేనంబరు 9/1లో భూములు పట్టణ భూగరిష్ఠ పరిమితి చట్టం పరిధిలోనివని, ఈ భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరారు.

జీవీఎంసీకి 102 ఫిర్యాదులు

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)కు 102 ఫిర్యాదులు అందాయి. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి బాధితుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులను పిలిచి సమస్య పరిష్కారానికి తక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డీవీరమణమూర్తి, ఎస్ఎస్‌వర్మ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సదస్సు విజయవంతం

- అభినందన సభలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా జరిగిన పెట్టుబడిదారుల భాగస్వామ్యసదస్సు (సీఐఐ) విజయవంతం కావడానికి జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికుల సమష్టి కృషి కారణమని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. జీవీఎంసీ అద్భుతంగా పనిచేసిందంటూ కమిషనర్ కేతన్ గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావులను సీఎం చంద్రబాబునాయుడు వేదికపై అభినందించి జ్ఞాపిక అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీవీఎంసీలో కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం అధికారులు, ఉద్యోగులతో అభినందన సభ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సీఐఐ సదస్సుకు 40 దేశాల నుంచి ప్రతినిధులు, ఉపరాష్ట్రపతి, కేంద్రమంత్రులు, పారిశ్రామిక దిగ్గజాలు వస్తున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు తొలుత ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో నగర సుందరీకరణకు అధికారులు, ఉద్యోగులు ఎంతగానో శ్రమించారన్నారు. పారిశుధ్య కార్మికులు అద్భుతంగా పనిచేశారని కితాబిచ్చారు. నగర అందాలు, పరిశుభ్రతను చూసి ప్రతినిధులు ఆశ్చర్యపోయారన్నారు. ఇకపై కూడా సమష్టిగా పనిచేసి జీవీఎంసీ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని కోరారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు కలిసి కమిషనర్‌ను సత్కరించారు. అదనపు కమిషనర్లు డీవీరమణమూర్తి, ఎస్ఎస్‌వర్మ, చీఫ్ ఇంజనీర్ పీవీవీ సత్యనారాయణరాజు, చీఫ్‌సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు, ఉద్యోగులు

రైల్వే స్టేషన్లలో అరకు, కొరాపుట్ కాఫీ స్టాల్స్



విశాఖ రైల్వేస్టేషన్‌లో కాఫీ స్టాల్

విశాఖపట్నం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశీయ సేంద్రీయ ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించడంలో భాగంగా వాల్తేరు డివిజన్ పరిధిలోని అరకు, కొరాపుట్ రైల్వే స్టేషన్లలో కాఫీ ఓఎస్ఓపీ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ అరకు, కొరాపుట్ కాఫీ బ్రాండ్‌లకు ప్రత్యేకత ఉన్న నేపథ్యంలో 'వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ పథకంలో భాగంగా స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడంలో భాగంగా గిరిజన రైతుల పండించే కాఫీ రకాలు ప్రతి మూలకు చేరుకోవాలని అభిప్రాయపడ్డారు. అరకు కాఫీ సాగు పద్ధతులు హర్షణీయమన్నారు. అలాగే దేశంలో వెనుకబడిన ప్రాంతంగా పేర్కొనే ఒడిశాలోని కొరాపుట్ జిల్లా ఉత్పత్తి చేసే కాఫీకి ప్రత్యేకత ఉందన్నారు. అరకు, కొరాపుట్ కాఫీ ఉత్పత్తులకు మరింత ప్రచారం కల్పించేందుకు గిరిజన్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్, ఒడిశా గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్ సొసైటీ సహకారంతో ప్రత్యేక ప్యాకెట్లు, ఫిల్టర్ కాఫీ సాచెట్లు, ఇన్‌స్టంట్ కాఫీ బాటిల్స్ వంటివి ఈ స్టాల్స్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

కంచరపాలెం బాలికల ఐటీఐలో 21న జాబ్‌మేళా

కంచరపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం బాలికల ఐటీఐ ప్రాంగణంలోని నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 21న నిర్వహించనున్న జాబ్‌మేళాకు ఏర్పాట్లు చేసినట్టు ఉప ఉపాధి కల్పనాధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. జాబ్‌మేళాలో శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరాం మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ తదితర సంస్థలు పాల్గొంటాయి. సేల్స్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్షన్, కెమిస్ట్ తదితర ఉద్యోగాలకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన యువత హాజరుకావచ్చునన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్టణం, విజయవాడ, హైదరాబాద్, చెన్నైలలో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

శాయ్ క్రీడాకారులకు వార్షిక కిట్ల పంపిణీ



క్రీడా కిట్లు అందుకున్న క్రీడాకారులతో ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్ రాజు తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోర్టు అథారిటీ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌కు అంతర్జాతీయ క్రీడాకారులను అందించిన ఘనత ఉందని ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు పి.గణబాబు పేర్కొన్నారు. సోమవారం శాయ్ సెంటర్‌లో క్రీడాకారులకు వార్షిక క్రీడా కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతర్జాతీయ బాక్సర్లు, వాలీబాలర్లు ఇక్కడి నుంచే తయారయ్యారని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ పోర్టు స్టేడియాన్ని ప్రైవేటు వ్యక్తికి లీజుకు ఇచ్చిన తర్వాత శాయ్ ట్రైనింగ్ సెంటర్ అనేక ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిందన్నారు. ఉన్నత స్థాయి క్రీడాకారులను అందించే ఇటువంటి ట్రైనింగ్ సెంటర్‌కు భవిష్యత్తులో సమస్యలు ఎదురవకుండా తన వంతు సహాయ సహకారాలందిస్తానన్నారు. అనంతరం శాయ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న బాక్సింగ్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు వార్షిక క్రీడా కిట్లను గణబాబు, విష్ణుకుమార్ రాజులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో శాయ్ సెంటర్ ఇన్‌చార్జి సత్యనారాయణ, వాలీబాల్ సంఘం కార్యదర్శి రక్షణకుమార్, మోహనబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్ఎంను కలిసిన నూతన రీజనల్ కార్యదర్శి



ఆర్ఎం అప్పలనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నూతన రీజనల్ కార్యదర్శిగా ఎన్నికైన ఏకే.శివాజీ, ఇతర కార్యవర్గ సభ్యులు సోమవారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో తగిన చొరవ చూపాలని కోరారు. ఈసందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ కార్మికులు, అధికారులు సమిష్టిగా పనిచేస్తే ఆర్టీసీ త్వరగా ప్రగతి సాధిస్తుందన్నారు. మాజీ జోనల్ కార్యదర్శి ఎంవీఆర్ మూర్తి, జిల్లా ఛైర్మన్ ఫ్రాన్స్, గాజువాక డిపో కార్యదర్శి శంకరరావు, వాల్తేరు డిపో అధ్యక్షుడు ఆర్ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.